RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 2 | సంచిక : 322 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | గురువారం, జూన్, 12, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 2 | ISSUE NO : 322 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Thursday, June,12,2025 | PAGES : 8 RS : 4 /- |



## దేశంలో 7వేలకు పైగా కోవిడ్

# కేసులు

**ప్రధానిని కలవాలంటే కోవిడ్ టెస్ట్ తప్పనిసరి అధికార వర్గాల సమాచారం**

న్యూఢిల్లీ,జూన్11:దేశ వ్యాప్తంగా కోవిడ్ కేసులు అమాంతంగా పెరిగిపోయాయి. పదుల్లో ఉండే కేసులు ఇప్పుడు వేలల్లోకి వచ్చేశాయి. అన్ని రాష్ట్రాల్లోకరోనా కేసులు పెరిగిపోయాయి. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 7 వేలకు పైగా కోవిడ్ కేసులు నమోదయ్యాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిఆరోగ్య శాఖ సూచించింది. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి కార్యాల యం కూడా అప్రమత్తం అయింది. ఇకపై ప్రధాని మోడీని కలిసే మంత్రులు, ప్రభుత్వ శాఖ అధికారులు, ఇతర ప్రముఖులు తప్పనిసరిగా ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయించుకోవాలని పీఎంవో సూచించినట్లు- అధికారిక వర్గాలు తెలిపాయి. భారత్ లో కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. కేసుల సంఖ్య 6,815 కు చేరుకుందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత 24 గంటల్లో కొత్తగా 324 మందికి ఈ వ్యాధి సోకింది. చికిత్స పొందుతూ ముగ్గురు మరణించారు. మరో 783 మంది కోలుకున్నారు.

- నా వద్ద శాఖలనే కొత్త మంత్రులకు కేటాయిస్తా
- కెసిఆర్ తో సహా ఆ కుటుంబ అంతా నా శత్రువులే
- తాను కాంగ్రెస్ లోఉండగా వారందరికి హస్తం పార్టీలోకి నో ఎంట్రీ
- తెలంగాణకు అన్యాయం చేస్తున్నది కిషన్ రెడ్డే
- కెటిఆర్ సూచనతోనే మెట్రోకు కిషన్ అడ్డుపుల్ల
- ఢిల్లీ లో మీడియాతో చిట్ చాట్ లో రేవంత్ రెడ్డి



## పాత మంత్రుల శాఖలలో

# మార్పులుండవ్

న్యూ ఢిల్లీ :కొత్త మంత్రులకు తన వద్ద ఉన్న శాఖలనే కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.. పాత మంత్రుల శాఖల్లో ఎటువంటి మార్పులు ఉండవని ఆయన సంకేతాలు ఇచ్చారు.. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ఇవాళ తన పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు బయల్దేరే ముందు ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో జరిగిన మంత్రివర్గ విస్తరణపై ఢిల్లీలో ఎలాంటి చర్చ జరగలేదని, కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుల అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. హైదరాబాద్‌కు వచ్చాక అందరితో సంప్రదించి శాఖలు నిర్ణయిస్తామన్నారు. తాను ఢిల్లీకి వచ్చింది కర్ణాటకలో కులగణన అంశంపై అధిష్టానంతో చర్చించేందుకేనని చెప్పారు.

## కూటమి సర్కార్ ఏడాది పాలన

### ఏడాది పాలనపై నేడు బాబు సందేశం

**అమరావతి,జూన్11,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి సర్కార్ ఏర్పాటై నేటికి ఏడాది పూర్తి అవుతుంది. స్వపరిపాలన-స్వర్ణాంధ్ర ప్రదేశ్ పేరుతో అమరావతిలోరాష్ట్ర స్థాయి సభ ఏర్పాటుకు సన్నాహాలు కొనసాగుతున్నాయి. అమరావతిలో నేటి సాయంత్రం 5 గంటలకు భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఏడాది పాలనలో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై సీఎం చంద్రబాబు,డిప్యూటీ-సీఎం పవన్ కళ్యాణ్ ప్రసంగాలు చేయనున్నారు. మరోవైపు, సభ జరిగే ప్రాంతంలో రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో సభా ప్రాంగణం పూర్తిగా తడిసిపోయింది. దీంతోవేదిక మార్చాలా.. సచివాలయం వెనక ప్రాంతంలోనే సభా ఏర్పాట్లు- చేయ్యాలా అనే ఆలోచనలో అధికారులుఉన్నారు.ఏపీ సచివాలయం వెనక సభ ఏర్పాట్లు- చేస్తున్నారు అధికారులు.. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు హాజరుకానున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు తప్పకుండా హాజరు కావాలని రాష్ట్ర సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

## తెలంగాణ దాహాన్ని తీర్చిన

# దార్శనికుడు

**- విచారణల పేరుతో రేవంత్ రెడ్డి కెసిఆర్ వెంట్రుక కూడా పీకలేడు: కెటిఆర్**

**హైదరాబాద్,జూన్11,తెలంగాణ దిశ:** కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రాష్ట్రం కరువుకు, దాహానికి శాశ్వత పరిష్కారం చూపించారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. కేసీఆర్ బలం, జీవన దృక్కోణాన్ని అర్థం చేసుకోవడానికి జోకర్ కాంగ్రెస్ నాయకులకు జీవితకాలం కూడా చాలదు. అల్ప మనస్తత్వం ఉన్న కాంగ్రెస్ నాయకులు వందజన్మలు ఎత్తినా కూడా కేసీఆర్ సాధించిన విజయాల్లో పదవంతైనా సాధించలేరు అని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ వెంట్రుకను కూడా పీకలేడని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. కెసిఆర్ కాళేశ్వరం విచారణకు హాజరయిన సందర్భంగా, బీఆర్కే భవన్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.





## కేబినేట్ నిర్ణయం మేరకే

# కాళేశ్వరం

- వ్యాప్కోస్ సిఫారసుల ప్రకారమే నిర్మాణం
- త్వరగా నిర్మించేందుకు కమిషన్ ఏర్పాటు
- వ్యాప్కోస్ సూచన మేరకు స్థల మార్పు
- ప్రాజెక్టుపై అన్ని అంశాలతో కూడిన బుక్ అందచేత
- 50 నిముషాల పాటు కెసిఆర్‌ను విచారించిన కమిషన్
- ఓపెన్ కోర్టు కాకుండా ఇండోర్‌లో విచారణ
- కమిషన్ ముందు సుదీర్ఘంగా వివరణ ఇచ్చిన కెసిఆర్

హైదరాబాద్,జూన్11,తెలంగాణ దిశ: క్యాబినెట్, ప్రభుత్వ ఆమోదంతోనే కాళేశ్వరం ఆనకట్టల నిర్మాణం జరిగిందని మాజీ కేసీఆర్ జస్టిస్ ఘోష్ కమిషన్ ముందు స్పష్టం చేశా రు. వ్యాప్కోస్ సిఫారసుల ప్రకారమే స్థల మార్పు చేసి, నిర్మాణం జరిగిందని.. అందుకు అన్ని అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అన్ని అంశాలతో ఉన్న పుస్తకాన్ని కమిషన్‌కు అందజేశారు. బీఆర్కే భవన్‌లో కాళేశ్వ రం కమిషన్ ఎదుట మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ విచారణ ముగిసిం ది. ఆయన్ను పీసీ ఘోష్ కమిషన్ సుమారు 50 నిమిషాల పాటు విచారించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించింది.

## యశోదాలో పల్లాకు కెసిఆర్ పరామర్శ




**హైదరాబాద్,జూన్11,తెలంగాణ దిశ:** ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పరామర్శించారు. కాలు జారి కిందపడటంతో గాయపడి సోమాజీగూడ యశోద ఆసుపత్రిలో పల్లా చికిత్స పొందుతున్నారు. భారాస నేతలతో కలిసి యశోద ఆసుపత్రికి వెళ్లిన కేసీఆర్.. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేసీఆర్‌తో పాటు- మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పలువురు భారాస నేతలు పల్లాను పరామర్శించిన వారిలో ఉన్నారు.

కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిన తర్వాత కేసీఆర్ నేరుగా యశోదా ఆస్పత్రికి బయలుదేరి వెళ్లారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కేసీఆర్ పరామర్శించారు. కేసీఆర్ కాళేశ్వరం విచారణ సందర్భంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి సిద్దిపేటలోని ఫాంహౌస్‌కు వెళ్లారు. అయితే అక్కడ ప్రమాదవశాత్తు ఎమ్మెల్యే జారి పడ్డారు.

ఈ క్రమంలో ఆయన తుంటి ఎముకలో గాయమైంది. వెంటనే ఆయనను హుటాహుటిన అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో పల్లా రాజేశ్వర్ రెడ్డి చికిత్స పొందుతున్నారు.

**హైదరాబాద్,జూన్11,తెలంగాణ దిశ:** మరికొన్ని రోజుల్లో ఆషాడ మాసం రానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలూ బోనాల జాతరను జరుపుకునేందుకు రెడీ అవుతున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి ఆషాడ మాసం ప్రారంభం కానుంది. అయితే మొదటి రోజే గురువారం రావడంతో జూన్ 26వ తేదీ నుంచే బోనాల సంబురాలు ప్రారంభం కానున్నాయి. జూన్ 26న ఆషాడం మాసం ప్రారంభం కానుంది. ఆరోజు గురువారం కనుక తొలి బోనం గోల్కొండ లోని అమ్మవారికి సమర్పించడంతో బోనాల సంబురాలు ప్రారంభం అవుతాయి. ఆషాఢ మాస బోనాల ఏర్పాట్ల గురించి ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. అధికారులకు సూచనలు ఇస్తోంది. జంట నగరాల్లోని మొత్తం 28 ఆలయాల్లో ఆషాఢ బోనాల జాతర ఘనంగా జరపాలని చెప్పారు. భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రావొద్దని.. బోనాల పండగను జరపడం కోసం ఎక్కడ లోటు- లేకుండా ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని.. ప్రభుత్వం నుంచి ఇప్పటికే రూ 20 కోట్ల మంజూరు చేశామని చెప్పారు. ఒకవేళ బోనాల ఏర్పాట్లకు ఈ డబ్బులు సరిపోలేదు ఇంకా కావాలంటే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్నీ తీసుకెళ్దామని.. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. భక్తులకు ఇబ్బందులు ఎక్కడా రానివ్వకుండా ఏర్పాట్లు- చేయాలనీ అధికారులకు సూచించారు.



## ఆషాఢ బోనాలకు దగ్గర పడుతున్న సమయం

## ముందస్తు ఏర్పట్లో

# అధికార గణం

**ముందస్తు ఏర్పట్లో అధికార గణం**



## అక్రమ మైనింగ్ కేసులో

# గాలికి ఊరట

### నాంపల్లికోర్టు తీర్పును సస్పెండ్ చేసిన హైకోర్టు గాలి సహా నలుగురికి బెయిల్ మంజూరు

హైదరాబాద్,జూన్11 : ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నలుగురు దోషులకు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. గాలి జనార్ధనరెడ్డితో పాటు,ఆయన పీఏ అలీఖాన్, బీవీ శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్‌కు బెయిల్ ఇచ్చింది. ఈ నలుగురికి నాంపల్లి సీబీఐ కోర్టు విధించిన ఏడేళ్ల జైలు శిక్షను సస్పెండ్ చేసింది. దేశం విడిచి వెళ్లరాదని, రూ.10 లక్షలు సొంత పూచీకత్తు సమర్పించాలని షరతు విధించింది.

# పేదల నడ్డి విరుస్తున్న మోడీ సర్కార్

- బిఆర్ఎస్ అంటేనే బందిపోటు రాష్ట్ర సమితి
- తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందే కేసీఆర్
- కెసిఆర్ ది 420 ఫ్యామిలీ
- తెలంగాణలో దోచుకున్నదంతా కక్కిస్తాం
- సన్న బియ్యం పథకం దేశానికే ఆదర్శం
- మహిళా కాంగ్రెస్ ను బలోపేతమే లక్ష్యం
- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు







**మెదక్, జూన్ 11, (తెలంగాణ దిశ)** :కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ సర్కార్ గ్యాస్, నిత్యావసర ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తుందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు విమర్శించారు. జై బీమ్ జై బాపు జై సంవిదాన్ కార్యక్రమంలో భాగంగా మెదక్ లోని గోల్కొండ వీధిలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల విగ్రహాల ముందు నిరసన తెలిపారు. సందర్భంగా సునీత రావు మాట్లాడుతూ మోడీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.దేశ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయడంలో ఎన్డీఏ ప్రభుత్వం ఘోరంగా విఫలం అయిందన్నారు. భారత రాజ్యాంగాన్నే మార్చే కుట్ర కేంద్రం లోని మోడీ సర్కార్ చేస్తుందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది కేసీఆర్ అని, దానిని సరిచేసుకుంటూ పేదలకు సంక్షేమ పథకాలు అందించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. కాంగ్రెస్ వి 420 హామీలని కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కెసిఆర్ ఫ్యామిలీయే 420ఫ్యామిలీ ని ఘాటుగా విమర్శించారు. లిక్కర్ కేసులో జైలుకెళ్ళింది ఎమ్మెల్సీ, కెసిఆర్ కూతురు కవిత కాదా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ అంటేనే బందీ పోట్ల రాష్ట్ర సమితి అని సునీత రావు ఏద్దేవా చేశారు. పదేండ్ల లో బిఆర్ఎస్ పెద్దలు దోచుకున్నదంతా కక్కిస్తామమన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం దేశానికే ఆదర్శమని కొనియాడారు. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పనిచేస్తోందని, ఇందుకు నిదర్శనం కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం, పిసిసి పదవులే నిదర్శనమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు.

రాష్ట్రంలోమహిళా కాంగ్రెస్ ను బలోపేతం చేయడమే లక్ష్యంగా బూత్ స్థాయి కమిటీలు వేస్తామన్నారు. రేవంత్ సర్కార్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో లబ్ధిదారులంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. గడప గడప కు ప్రభుత్వ పథకాలు చేరేలా మహిళా కాంగ్రెస్ కార్యకర్త కృషిచేస్తారన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులను కలిసి సన్నబియ్యం అమలు తీరును తెలుసుకొని అక్కడే భోజనం చేశారు. ఈ కార్యక్రమం లో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరికాల అనుసూర్య,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆవుసుల భవాని, జిల్లా నాయకులు ముక్తా బాయి, అరుణ, కమల, స్వరూప, స్వప్న, అయితారం మల్లేశ్వరి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాప్రాలో 11 ఏళ్ల మోడీ ప్రస్థానంపై ఎగ్జిబిషన్




**కాప్రా, జూన్ 11,(తెలంగాణ దిశ)** :భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 11ఏళ్ల ప్రస్థానంపై కాప్రా లోని ఎల్లారెడ్డి గూడ మల్లారెడ్డి గార్డెన్ లో గురువారం ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా ఇంచార్జ్ అధ్యక్షులు మల్లారెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వే శ్వర్ రెడ్డి ఉదయం 10.30 గంట లకు ఎగ్జిబిషన్‌ను ప్రారంభి స్తారు. 11 ఏళ్ల మోడీ సుపరిపాలన, పేదల సంక్షేమంపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి శ్రేణులు కోరారు. 11ఏళ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు, చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఈ ఎగ్జిబిషన్ ద్వారా ప్రజలకు వివరించనున్నారు.

## బిజెపి ఏఎస్ రావునగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా సంపత్ రావు



**ఏఎస్ రావునగర్, జూన్ 11, తెలంగాణ దిశ)** :భారతీయ జనతా పార్టీ డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా సిద్దూరి సంపత్ కుమార్ నియమి తుల య్యారు. బిజెపిలో క్రియాశీలకంగా వ్యవహ రించే సంపత్ రావు హిందుస్థాన్ కేబుల్స్ లిమిటెడ్ (హెచ్ సిఎల్) విశ్రాంత ఉద్యోగి. ఈ సందర్భంగా సంపత్ రావు మాట్లాడు తూతననియామకానికి సహకరించిన మ ల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్రఉపా ధ్యక్షులు,ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వియస్ఎస్ ప్రభాకర్, బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా ఇంచార్జ్ అధ్యక్షులు మల్లారెడ్డి, ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షురాలు తుమ్మల సంధ్యారెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో హెచ్ సి ఎల్ సేఫ్టీ కౌన్సిల్ సభ్యులుగా, యూనియన్ కౌన్సిల్ సభ్యులుగా సంపత్ రావు పనిచేశారు ఈ సందర్భంగా హెచ్ సి ఎల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం విశేషంగా కృషి చేశారు. బిజెపి ఏఎస్ రావు నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా సంపత్ రావుకు అవకాశం కల్పించడం పట్ల బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

## స్లమ్ ఏరియాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా





**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 11, (తెలంగాణ దిశ)** :ప్రభుత్వ భూములలో ఉంటున్న నిరు పేదలకు పక్కా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు గాను ప్రభుత్వ భూములలో స్లమ్స్ ను గుర్తించి నివేదికలు సమర్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా తహాసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లుకు సూచించారు. ఇందు కోసం అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూములలో ఉన్న మురికివాడలలో ఉన్న ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద వాటిని తిరిగి నిర్మించేందుకుగాను స్థలాలను గుర్తించేందుకు తహాసీల్దార్లను, మున్సిపల్ కమీషనర్లు సమన్వయంతో పనిచేసి నివేదిక సమర్పించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద శిథిలావస్థలో, ఇరుకుగా ఉన్న ఇళ్లను పునర్నిర్మించేందుకు జిల్లాలోని ప్రతి మున్సిపాలిటిల పరిధిలో ఉన్న స్లమ్ ఏరియాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములలో మురికివాడ లలో ఉన్న ఇళ్లను గుర్తించి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆ కుటుంబాల సమ్మతితో నివేదికలు తయారు చేసి ఈ నెల 13వ తేదిలోగా నివేదికలు అందించాలని తెలిపారు. సర్వేలో, ప్రజలను ఒప్పించడంలో స్థానిక నాయకులను భాగస్వాములను చేయాలన్నారు. భవిష్యత్తులో అన్ని మురికివాడల నివాసితులకు అన్ని సౌకర్యాలతో పాటు గౌరవప్రదమైన గృహాలను అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సమావేశంలో మేడ్చల్ హౌజింగ్ ఈఈ రమణమూర్తి, తహాసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు,తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ రావునగర్ డివిజన్ లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్

ఏఎస్ రావునగర్, జూన్ 11 (తెలంగాణ దిశ) : జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. స్థానిక నగర్ కమలా నగర్ లో ఏఎస్ రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 25 వ తేదీ వరకు వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజారోగ్యం, పారిశు ధ్య విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. “ముందస్తు వర్షాకాల ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్” బుధవారం నుంచి గ్రేటర్ హైదరాబాద్ అన్ని సర్కిల్ లలో చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. బుధవారం ఏపీఐఐసీ కాలనీ, భవానీనగర్, అణుపురం, కమలానగర్, మహేష్ నగర్, ఏఎస్ రావునగర్, పరిమళానగర్, జమ్మిగడ్డ, పద్మశాలి టౌన్ షిప్, నార్త్ కమలానగర్ మొదలగు వివిధ కాలనీలలో వీధులను శుభ్రం చేశారు. ప్రత్యేక వాహనాల ద్వారా చెత్తను, గ్రీన్ వేస్ట్ తొలగించారు. దోమల నివారణ కోసం దోమల మందు చల్లడం, ఫాగింగ్ చేశారు. రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు, ప్రమాదకరంగా ఉన్నటువంటి చెట్ల కొమ్మలను తొలగించారు. స్థానిక కార్పొరేటర్



శ్రీమతి సింగిరెడ్డి శిరీష రెడ్డి మాట్లాడుతూ ప్రజలు తమ ఇండ్ల, వ్యాపార స్థలాల నుండి వెలువడే చెత్తా చెదారాన్ని, ఇంటి నిర్మాణ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా జిహెచ్ఎంసి ఆటో వారికి ఇవ్వాలని సూచించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు విష జ్వరాలబారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చునని అన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఇంటి పరిసరాలలో నీరు నిలవకుండా దోమలు అభివృద్ధి చెందకుండా చూసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాలనీలలో బస్తీలలో దోమల నివారణ మందులు స్ప్రే చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


- కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి





**ఏఎస్ రావునగర్, జూన్ 11 : (తెలంగాణ దిశ)** :వన్ డే వన్ వార్డు కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఏఎస్ రావునగర్ లోని టీఎస్ఐఐసి కాలనీలో దోమల నిర్మూలన కార్యక్రమాన్ని స్థానిక కార్పోరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈనెల 25వ తేదీ వరకు చేపట్టే దోమల నివారణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆమె సూచించారు. టీఎస్ఐఐసి కాలనీలో దోమల నివారణ కార్యాచరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎంటమాలజీ కార్మికులకు పలు సూచనలు చేసారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దోమల నిర్మూలన కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యాచరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా టీఎస్ఐఐసీ కాలనీ లోని పలు ఇండ్లలో నీటి నిల్వలను పరిశీలించి సేకరించిన లార్వా పై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. లార్వా ద్వారా అభివృద్ధి చెందే దోమ వల్ల డెంగ్యూ, మలేరియా వ్యాపిస్తాయని అన్నారు. వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సర్కిల్ ఏఈ డి. రమేష్, ఎంటమాలజీ సూపర్ వైజర్ నరేందర్ రెడ్డి, ఎంటమాలజీ ఇన్ సెట్ కలెక్టర్లు, శానిటేషన్ కార్మికులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మైనారిటీలకు ఉచిత కుట్టు మెషిన్ల పంపిణీ



**మల్లాపూర్ జూన్ 11, (తెలంగాణ దిశ)** :కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మల్లాపూర్ డివిజన్ మైనారిటీ లబ్ధిదారులకు ఉచిత కుట్టు మెషిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా మైనారిటీ సోదరీమణులు తమకు అండగా నిల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం చేసారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో ఉప్పల్ నియోజకవర్గ మైనారిటీలకు మంచి రోజులు వచ్చాయని అన్నారు.



## బాల కార్మిక నిర్మూలన దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

**మేడ్చల్ కలెక్టరేట్ జూన్ 11, (తెలంగాణ దిశ)** :బాల కార్మిక నిర్మూలన దినోత్సవం పోస్టర్ ను బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు చేతుల మీదుగా ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి, జిల్లా సంక్షేమ అధికారి శారద, బాల రక్షక భవన్ కోఆర్డినేటర్ తిరుమలాదేవి, బాలల పరిరక్షణ జిల్లా అధికారి ఇంతియాజ్, అసిస్టెంట్ లేబర్ అధికారులు రేణుక, రవీందర్ రెడ్డి, ప్రత్యేక దత్తత ఏజెన్సీ మేనేజర్ అరుణ్ జంజల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక పేదలకే డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి

**నాగారం, జూన్ 11, (తెలంగాణ దిశ)** :స్థానిక ప్రజలకే డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ బిజెపి నాయకులు కౌకుట్ల చంద్రారెడ్డి కోరారు. బుధవారం నాగారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మత ప్రాతిపదికన స్థానికేతరులకు కేటాయించిన విషయంలో హైకోర్టు స్థానిక పేదలకే ఇల్లు కేటాయించాలని సూచించిందన్నారు. నాగారం మున్సిపల్ పరిధిలో 6200 పై చిలుకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించారని తెలిపారు. ఇందులో మున్సిపాలిటీ పరిధిలోని అర్హులకు 10 శాతం 620 ఇవ్వాలని గతంలో కోర్టును ఆశ్రయించగా స్టే ఇవ్వడం జరిగిందన్నారు. మున్సిపల్ పరిధి పేద ప్రజలకి ఈ ఇండ్లు కేటాయించే వరకు పోరాటం ఆగదని అన్నారు. లేని పక్షంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో పెద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. న్యాయ పోరాటానికైనా సిద్ధమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్ రెడ్డి, వీరేష్ గౌడ్, కృష్ణ చారి తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## సమగ్ర అభివృద్ధికి ఆక్సిజన్ రిజర్వేషన్లు..!

భారత రాజ్యాంగం దేశంలో అత్యంత వెనుకబడిన, అణచివేయబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలు, ఆర్థికంగా బలహీనుల అభివృద్ధికి రిజర్వేషన్ల విధానం ద్వారా ఎంతో దోహదం చేసింది. ఈ విధానం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యాలయాల అడ్మిషన్లు వంటి ప్రక్రియల్లో ఆయా వర్గాల ప్రవేశం సుగమమై వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతుల్లో విస్తృతమైన మార్పులు వచ్చినవి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రిజర్వేషన్ల వ్యవస్థను రద్దు చేయాలన్న ఉద్దేశంలో భాగంగా బీజేపీ తన పదేళ్ల పాలనలో వందకు పైగా ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో అమ్మివేసింది. దేశంలో ముస్లింల సామాజిక వెనుకబాటుతనం ముస్లిం రిజర్వేషన్ల అవసరాన్ని తప్పనిసరి చేస్తున్నది. మన దేశంలో ముస్లింలు భారతీయ మూల సూత్రాలైన ఏకేశ్వరోపాసన, గురు పరంపర, అగ్నిపూజ, నాట్యం, సంగీతం వంటి అంశాలను అనుసరించే సూఫీ మార్గాన్ని అనుసరించేవారు, అంతేకాక, అధికులు పాస్మాండ ముస్లింలు. ముస్లింల స్థితిగతులపై నియమించబడిన రాజీందర్ సచార్, సుధీర్ కమిటీలు ముస్లింలు ఎస్సీ, ఎస్టీల కంటే వెనుకబడి ఉన్నారని తెలిపినాయి. కాబట్టి ముస్లిం రిజర్వేషన్లు అనేవి మత కోణంలో కాకుండా సామాజిక, ఆర్థిక కోణంలో పరిగణించబడి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో అమలు అవుతున్నాయి. దాదాపు దేశవ్యాప్తంగా 15శాతం కన్నా ఎక్కువగా ఉన్న ప్రధాన మైనారిటీ వర్గం అయిన ముస్లింలను ప్రధాన జీవన స్రవంతిలోకి తీసుకురావటానికి ఈ రిజర్వేషన్లు దోహదం చేస్తాయి. ప్రభుత్వ సంస్థలు తగ్గితే ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గుతాయి. క్రమంగా రిజర్వేషన్లు నామమాత్రంగా మారతాయి. దీనితో పైన పేర్కొన్న వర్గాలన్నిటికీ ప్రాతినిధ్యం తగ్గుతుంది. ఇది బీజేపీ ఉద్దేశం. కాని కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల్లో అణచివేయబడిన వర్గాల ప్రాధాన్యత పెంచటానికి 2024 ఎన్నికల మేనిఫెస్టోలో రిజర్వేషన్ల పరిమితి 50శాతం కంటే ఎక్కువగా పెంచుతామని ప్రకటించింది. బీజేపీ పదేళ్ల పాలనలో ప్రభుత్వ రంగ సంస్థల అమ్మటం, అనుయాయులకు ఓడ రేవులు విమానాశ్రయాలు ఇవ్వటం, మత విద్వేషాలు రెచ్చగొట్టడం మినహా చేసిన అభివృద్ధి ఏమీ లేదు. పైగా ప్రధానమంత్రి మోదీ ఎన్నికల ప్రచారంలో తన స్థాయిని దిగజార్చుకుని ముస్లిం రిజర్వేషన్లు వంటి అంశాలపై వ్యతిరేక వ్యాఖ్యలు చేయటం దురదృష్టకరం. అంతేగాక కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు తగ్గించి ముస్లింలకు 15శాతం రిజర్వేషన్లు ఇస్తుందని మరో అబద్ధపు ప్రచారం ప్రారంభించారు. వాస్తవానికి కాంగ్రెస్ ఎన్నికల పత్రంలో ఎక్కడా వీటి గురించి చర్చలేదు. అయితే భారత్‌లో తీవ్రంగా ఉన్న ఆదాయ అసమానతలను అంచనా వేసి ఆర్థిక విధానాల్లో మార్పులు తీసుకురావడం ద్వారా సంపద సమాన పంపిణీ చేస్తామని, ఆదాయ అసమానతల నిర్మూలన చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టో తెలిపింది. ఈ అంశాన్నే మోదీ వక్రీకరించారు. దేశంలో ముస్లింల సామాజిక వెనుకబాటు తనం ముస్లిం రిజర్వేషన్ల అవసరాన్ని తప్పనిసరి చేస్తున్నది. మన దేశంలో ముస్లింలు భారతీయ మూల సూత్రాలైన ఏకేశ్వరోపాసన, గురు పరంపర, అగ్నిపూజ, నాట్యం, సంగీతం వంటి అంశాలను అనుసరించే సూఫీ మార్గాన్ని అనుసరించేవారు, అంతేకాక, అధికులు పాస్మాండ ముస్లింలు. ముస్లింల స్థితిగతులపై నియమించబడిన రాజీందర్ సచార్, సుధీర్ కమిటీలు ముస్లింలు ఎస్సీ, ఎస్టీల కంటే వెనుకబడి ఉన్నారని తెలిపినాయి. కాబట్టి ముస్లిం రిజర్వేషన్లు అనేవి మత కోణంలో కాకుండా సామాజిక, ఆర్థిక కోణంలో పరిగణించబడి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో అమలు అవుతున్నాయి. దాదాపు దేశ వ్యాప్తంగా 15శాతం కన్నా ఎక్కువగా ఉన్న ప్రధాన మైనారిటీ వర్గం అయిన ముస్లింలను ప్రధాన జీవన స్రవంతిలోకి తీసుకు రావటానికి ఈ రిజర్వేషన్లు దోహదం చేస్తాయి. రిజర్వేషన్లను 50శాతానికి పెంచాలి అంటే కులగణన తప్పనిసరి. కులగణన ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల జనాభా వివరాలు తెలిసిన తర్వాత తదనుగుణంగా రిజర్వేషన్లు అమలైతే వారి ప్రాతినిధ్యం న్యాయంగా పెరిగి సామాజిక అభివృద్ధి సాధ్యపడుతుంది. కులగణన ద్వారా ఆయా వర్గాలకు ప్రత్యేకంగా ప్రణాళికలు, విధానాల రూపకల్పన చేయడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది. దేశంలో 1931 నాటివి మినహా బీసీ గణాంకాలు అందుబాటులో లేవు. కాబట్టి దేశంలో కుల గణన ద్వారా బీసీ జనాభా లెక్కించడం ద్వారా వారి స్థితిగతులను అంచనా వేయవచ్చు. భారతీయ మూలవాసులు, భూమి పుత్రులు అయిన ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధికి కులగణన తప్పనిసరి అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మూలాల ఆధారంగా శూద్రునిగా ప్రకటించుకుని, వారి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, కులగణన ద్వారా వారికి ఖచ్చితంగా తగిన రాజకీయ, ఆర్థిక ప్రాతినిధ్యం కల్పిస్తామని చెప్పటం గమనార్హం. రిజర్వేషన్లు, రాజ్యాంగం, కులగణన వంటి అంశాల్లో బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యల పట్ల దేశ వ్యాప్తంగా తీవ్ర విమర్శలు ఎదురు కావడంతో బీజేపీ యుటర్న్ తీసుకుని మాట మారుస్తున్నది. ఓబీసీ వ్యతిరేకత వల్ల తమ ఓట్లకు గండి పడుతుందని రిజర్వేషన్లు రద్దు చేసే ఆలోచన లేదని వివరణ ఇచ్చుకుంది. కులగణనకు బీహార్‌లో బీజేపీ అనుకూలంగాను, కేంద్రంలో బీజేపీ వ్యతిరేకంగానూ ఉంటూ రెండు నాలుకల ధోరణి అవలంభించటం సిగ్గుచేటు. దీనికి ప్రధాన కారణం దేశంలో కులగణన వల్ల రిజర్వేషన్ల పరిమితిని పెంచాల్సిన అవసరం బైటపడటం, ఇతర అనేక డిమాండ్లు నెరవేర్చాల్సి రావటం. స్వంత రాజకీయ ప్రయోజనాల కోసం కులగణనను బీజేపీ వ్యతిరేకించటం పూర్తిగా ఖండించాల్సిన అంశం. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తరఫున రాహుల్ గాంధీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున రేవంత్ రెడ్డి కుల గణనకు సంపూర్ణంగా కట్టుబడి ఉన్నారు. గాంధీ అన్నటు సమగ్ర ఐక్యతే భారతీయతకు మూలం’. కులగణన ద్వారా రిజర్వేషన్లు పెంచి భారతీయ మూలవాసుల సమగ్ర సమ్మిళిత అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోంది.

# అభివృద్ధి పథంలో నాగారం మునిసిపాలిటీ

## అభివృద్ధి పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



**నాగారం,జూన్ 11(తెలంగాణ దిశ):** నాగారం మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అధికారులు ప్రకటించారు. ఇందులో భాగంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధిక గుప్తా పరిశీలించారు. ప్రజల సంక్షేమం, నగర స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి కీలక రంగాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను అమలు చేసేందుకు ప్రత్యేక అధికారి, మునిసిపాలిటీ అధికారులు పలు ప్రాంతాలను సందర్శించి వివిధ అభివృద్ధి పనులను సమీక్షించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నాలాల



శుభ్రత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నాలాలలో మురుగు నిల్వ కాకుండా చేయడం, నీటి ప్రవాహం అంతరాయం కలగ కుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అనేక ప్రాంతాలలో నాలా శుభ్రపరిచే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు వారు వివరించారు. అదే విధంగా దయారా కుంట రూ. మూడు కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దయారా కుంటను మరింత అందంగా తీర్చిదిద్దే పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ముఖ్యంగా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు, కుంట చుట్టూ పార్కు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసే దిశగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మున్సి



పాలిటీ పరిధిలోని జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని అధికారులు సందర్శించారు. కేంద్రం పనితీరును సమీక్షించారు. వీధి శునకాల సంఖ్య నియంత్రణ కోసం శస్త్రచికిత్సలు జరుగుతున్న తీరును పరిశీలించారు.

వాతావరణ అనుకూలత కోసం ఈ కేంద్రంలో ఎయిర్ కండిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రై రిసోర్స్ సెంటర్ – జీవసర్ది వినియోగంపై దృష్టి సారించినట్లు తెలిపారు ఇందులో భాగంగా రూ. 24 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు.

పునర్వినియోగ పదార్థాలను వేరు చేసే డ్రై రిసోర్స్ సెంటర్ ను అధికారులు సందర్శించారు. ఇక్కడ ఉత్పత్తి అవుతున్న జీవసర్దిని మరింత సమర్థంగా ఎలా వినియోగించు కోవాలి అనే అంశంపై ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇది పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో మొక్కల సంరక్షణ పై దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పరిశ్రమల ప్రాంతంలో 2000 గజాలలో 800 మొక్కలను వన మహోత్సవం సందర్భంగా నాటిన మొక్కల పరిస్థితిని పరిశీలించారు. మొక్కల పెంపకం, వాటి సంరక్షణ చర్యలను ఈ సందర్భంగా వారు సమీక్షించారు. ఆర్‌ఎల్ నగర్ లోని 1వ వార్డు రోడ్డు నిర్మాణంతో ప్రజలకు ఊరట కల్పించారు. ఇందులో భాగంగా రీగల్ ఫోర్ట్ ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలోని ఆర్‌ఎల్ నగర్ లో నూతనంగా 280 మీటర్ల రోడ్డును నిర్మించారు. అనేక సంవత్సరాలుగా స్థానికులు కోరుతున్న ఈ రోడ్డు నిర్మాణం పూర్తవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా ప్రధాన రహదారి చక్రిపురం చౌరస్తా నుండి హైమద్ గూడ వరకు చాలా రోజుల నుండి ఎదురుచూస్తున్న గుంతలు ప్యాచ్ వర్క్, రేడియం పెయింటింగ్ ప్రధాన రోడ్లు కాలనీకి పోయే రోడ్లుతో పాటు మరమ్మత్రాన్ని చేపట్టారు. ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చురుకుగా అనేక సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ నిర్మాణాలకు సిసి రోడ్ల కోసం సుమారు రూ.10,22,22,188, డ్రైన్లు నిర్మాణానికి సుమారు రూ. 2,81,05,645 వ్యయంతో చేపడుతున్నట్లు తెలిపారు. వీటి వల్లరవాణా సౌలభ్యం పెరగడంతో పాటు, వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యల నుండి ఉపశమనం లభిస్తుందన్నారు. నాగారంలో విలీనమైన గ్రామ పంచాయతీల అభివృద్ధికి రూ. 2.50 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆయా గ్రామపంచాయతీలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

2025-26 సంవత్సరంలో మునిసిపాలిటీ పరిధిలో 4 పార్కులను ఆధునీకరించనున్నట్లు తెలిపారు. ఇవి ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలికి, కుటుంబాలతో విశ్రాంతి కోసం ఎంతో ఉపయోగపడతాయన్నారు. అదే విధంగా 12 చిల్డ్రన్స్ పార్కులు అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా మూడు పార్కులను ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా 100 రోజుల ప్రణాళికలో భాగంగా మిగిలిన పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు అధికారులు వివరించారు.



## కేసీఆర్ కు మద్దతుగా తరలిన వెళ్ళిన బిఆర్ఎస్ శ్రేణులు



**కుత్బుల్లాపూర్,జూన్ 11,(తెలంగాణ దిశ)** :కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన జస్టిస్ పీసీ గోష్ కమీషన్ విచారణకు బిఆర్ఎస్అధినేత కేసీఆర్ హాజరవనున్న నేపథ్యంలో కేసీఆర్‌కు మద్దతుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆధ్వర్యంలో పార్టీనాయకులు, కార్యకర్తలు బిఆర్ కె భవన్‌కు తరలివెళ్లారు, న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచిబిఆర్ కె భవన్ వరకు భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్‌కు చెందిన పలువురు మాజీ కార్పొరేటర్లు, డివిజన్అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదల ఆరోగ్య రక్ష



**కుత్బుల్లాపూర్, జూన్ 11, (తెలంగాణ దిశ) :**
రంగారెడ్డి నగర్ డివిజన్ పంచశీల కాలనీకి చెందిన మధుస్మిత జెన (25) కేరాఫ్ జెన సురేంద్ర కుమార్ కు బుధవారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో రూ. 1.40 లక్షల ఎల్ఓసి పత్రాలను మాజీ కార్పొరేటర్ విజయశేఖర్ గౌడ్ చేతుల మీదుగా అందజేశారు.

బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ వైద్య సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిదారులు మధుస్మిత జెన కు ఎల్ఓసి మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య రక్ష సీఎం సహాయనిధి అని, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూసేవారు ముఖ్యమంత్రి సహాయనిధిని వినియోగించుకోవాలన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులు ఇవ్వాలి



**కుత్బుల్లాపూర్ జూన్ 11,(తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోనిపలు ప్రాంతాలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైన నిధులు కేటాయించాలని ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ ను కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి కోరారు. బుధవారం మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన పేద ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 126 డివిజన్ అధ్యక్షులు గణేష్, నిజాంపేట్ మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

## చేరవాణి వాడవద్దని తల్లి మందలింపు...

## యువతి అదృశ్యం



**జవహర్ నగర్, జూన్ 11, (తెలంగాణ దిశ)** :తరచుగా చేరవాణి వాడొద్దని తల్లి మందలించడంతో కోపంతో ఇంటి నుంచి బయటకు వెళ్ళి అదృశ్య మైంది ఈ ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి జమ్మిగడ్డలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్వో సైదయ్య తెలిపిన కథనం ప్రకారం కాప్రా మండల పరిధి జమ్మిగడ్డలోని జై జవాన్ కాలనీలో కేశవ్ కదర, భార్య చంద్ర, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులకు వివాహాలు కాగా చిన్న కుమార్తె లాలితో కలిసి ఉంటున్నారు ఈ నెల 11న లాలి (20) ఇంట్లో చెప్పకుండ బయటకు వెళ్ళి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆచూకి కోసం చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. చేరవాణి తరచుగా వాడొద్దని తల్లి మందలించడంతోనే లాలి ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోయి ఉండొచ్చని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కుటుంబసభ్యులు పేర్కొన్నారు ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సాంబరాజు రవి సేవలు చిరస్మరణీయం



**జవహర్ నగర్,జూన్ 11, (తెలంగాణ దిశ)** :జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లోని అంబేద్కర్ నగర్ చాకలి ఐలమ్మ ధోభీ ఘాట్లో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శాగంటి వెంకటేష్ , జిల్లా యూత్ అధ్యక్షులు పొలాస సాయికుమార్ అధ్వర్యంలో బుధవారం తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి (టిఆర్ఆర్ఎస్) మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్గీయ డాక్టర్ సాంబరాజు రవి ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. భౌతికంగా వారు మా మధ్యన లేకున్నా రజక జాతికి చేసిన సేవలు చిరస్మరణీయం.వారు మా మధ్య లేని లోటు స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. సాంబరాజు రవి మరణించి రెండు సంవత్సరాలైన వారి జ్ఞాపకాలు అలాగే ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి అంబేద్కర్ నగర్ అధ్యక్షులు చీమల కొండూరు యాదగిరి, సిహెచ్ కృష్ణ ,పొలస కిరణ్ కుమార్, రాజు మరియు కత్తెరపల్లి సంపతి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యానికి అనుగుణంగా వస్త్ర ఉత్పత్తి చేయాలి


**రాజన్న సిరిసిల్ల,తెలంగాణ దిశ:** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ ప్రకారంలక్ష్యానికి అనుగుణంగా వస్త్రం ఉత్పత్తి చేయాలని హ్యాండ్లూమ్స్ టెక్స్ టైల్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ సూచించారు. సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమకు చెందిన యజమానులు, ఆసాములు, కార్మికులు, టెక్స్ టైల్స్ పార్క్ పరిశ్రమల యజమానులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం హ్యాండ్లూమ్స్ టెక్స్ టైల్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటిదాకా ఎంత ఉత్పత్తి చేశారో ఆరా తీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలు, సమగ్ర శిక్ష అభియాన్, మహిళా శక్తి చీరల ఆర్డర్లపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయా శాఖలకు ఆయా శాఖల నుంచి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అందించిన ఆర్డర్లలో మార్చి 15వ తేదీలోగా 50 శాతం అందజేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా వస్త్రాల ఉత్పత్తిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గతంలో తాము ఉత్పత్తి చేసిన వస్త్రాలకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని, సెస్ విద్యుత్తు బ్యాక్ బిల్లింగ్ సమస్య పరిష్కరించాలని, యంత్రాల కొనుగోలు తదితర అంశాలకు సహాయం అందించాలని వస్త్ర పరిశ్రమ బాధ్యులు విజ్ఞప్తి చేశారు.

# బడులా.. బంజరుదొడ్లా..?



**కరీంనగర్,తెలంగాణ దిశ:** అనేక ప్రభుత్వ పాఠశాలల్లో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. ఎక్కడ చూసినా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గత ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు–మన బడి' 'మన బస్తీ –మన బడి' కార్యక్రమానికి ప్రత్యామ్నాయంగా ప్రస్తుత ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ పాఠశాలల' పేరిట మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్రం ప్రగతి అంతంతే ఉన్నది. ప్రభుత్వం ఎంత వేగిర పర్చినా పనుల్లో 50 శాతం కూడా పూర్తి కాలేదని తెలుస్తున్నది. కరీంనగర్ జిల్లాలో మొత్తం 698 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 'మన ఊరు – మన బడి' 'మన బస్తీ –మన బడి' కింద గత ప్రభుత్వం 230 పాఠశాలలను ఎంపిక చేసింది. అందులో 40 పాఠశాలలను పైలెట్‌గా ఎంపిక చేసి వాటిలో పనులు పూర్తి చేసింది. మిగతా పాఠశాలల్లో మిగిలిన పనుల గురించి ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 'అమ్మ ఆదర్శ పాఠశాలల' పేరిట ఇదే కాన్సెప్ట్‌తో కొత్త పథకాన్ని తీసుకున్న ప్రస్తుత ప్రభుత్వం 345 పాఠశాలలను ఎంపిక చేసింది. వీటిలో మౌలిక సదుపాయాలు కల్పించేం దుకు 14.19 కోట్లు వెచ్చించింది. ఈ నిధుల నుంచి మొదట 50 శాతం విడుదల చేసింది. కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా ఇవ్వగా, రెండో విడుతగా మరో 25 శాతం నిధులు ఇచ్చింది. పనులు పూర్తయిన తర్వాత మిగతా 25 శాతం నిధులు విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, ఇప్పటి వరకు మొదటి విడుత నిధులతో చేపట్టిన పనుల్లో 50 శాతం కూడా పూర్తికాని పరిస్థితి కనిపిస్తున్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి దుస్థితే ఉన్నట్టు తెలుస్తున్నది. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పాఠ్య పుస్తకాలు పాఠశాలలకు చేరాల్సి ఉన్నది. కానీ, వచ్చిన కొన్ని పాఠ్యపుస్తకాలు కూడా మండల రిసోర్స్ కేంద్రాల్లోని కనిపిస్తున్నాయి. వీటిని స్కూల్ పాయింట్ వరకు సరఫరా చేయాలని ప్రభుత్వ పరంగా ఆదేశాలున్నట్లు ఆయా ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు చెబుతుండగా, ఎంఆర్సీ భవనాల నుంచి ఆయా పాఠశాలల హెచ్ఎంలే తీసుకెళ్లాలని విద్యాధికారులు చెబుతున్నారు. నిజానికి కరీంనగర్ జిల్లాలోని 698 పాఠశాలల్లో 62,251 మంది విద్యార్థులు వివిధ తరగతుల్లో ఉన్నారు. వీరికి 4,66,644 పాఠ్య పుస్తకాలు అవసరం ఉండగా ఇప్పటి వరకు కేవలం 1.20 లక్షల పాఠ్యపుస్తకాలు మాత్రమే వచ్చినట్లు తెలుస్తున్నది. మిగతావి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. అంతే కాకుండా ఈ పుస్తకాలను స్కూల్ పాయింట్ వరకు ఎవరు చేరుస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరో పక్క ఉపాధ్యాయుల కొరత కూడా పాఠశాలలను వేధిస్తున్నది. కరీంనగర్ జిల్లాలో 492 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనికితోడు గత అక్టోబర్‌లో జరిగిన బదిలీల్లో రిలీవర్లు లేక ఇప్పటి వరకు పూర్వ స్థానాల్లోనే ఉన్న ఉపాధ్యాయులు ఈ సెలవుల్లో తమకు బదిలీ అయిన పాఠశాలల్లో విధుల్లో చేరుతున్నారు. వీణవంక, జమ్మికుంట, ఇల్లందకుంట, సైదాపూర్ వంటి మండలాల్లోని మారుమూల గ్రామాల్లో రిలీవర్ ఉపాధ్యాయులు రాకముందే ఆయా పాఠశాలల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు వెళ్లి పోతున్నారు. మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలల్లో 50 శాతం ఉపాధ్యాయులు కూడా అందుబాటులో లేని పరిస్థితి కనిపిస్తున్నది. ఈ పోస్టులను భర్తీ చేయాలంటే పదోన్నతుల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పదోన్నతుల ప్రక్రియ మొదలవగా, ఎలాంటి ఆటంకాలు లేకుంటే వారం పది రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంటుంది. కానీ, పదోన్నతుల్లో తమకు అన్యాయం జరిగిందని ఎవరైనా ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయిస్తే పరిస్థితి ఏమిటనేది సందేహంగా ఉన్నది. ఖాళీ పోస్టుల్లో విద్యా వలంటీర్లను నియమిస్తామని ప్రభుత్వం చెబుతున్నట్లు తెలుస్తున్నది.

# అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అసంపూర్తిగా పనులు



**మొయినాబాద్,తెలంగాణ దిశ:** నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్ర మానికి శ్రీకారం చుట్టి కొన్ని పాఠశాలలను ఎంపిక చేసింది. అందులో భాగంగా మొయినాబాద్ మండలంలో 19 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఎంపికైన ప్రతి పాఠశాలకూ రూ.లక్ష నిధులను మంజూరు చేసింది. తదనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలుగా పేరును మార్పు చేసింది. పాఠశాలల భవనాలు, మరుగు దొడ్ల మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, ఫ్యాన్‌లు, లైట్లు వంటి పనులను పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కానీ ఇప్పటి వరకు పనులు మాత్రం పూర్తి కాలేదు. నత్త నడకన సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరం. మొయినాబాద్ మండలంలో 19 పాఠశాలలు ఎంపికయ్యాయి. అందులో రెడ్డిపల్లి, చందానగర్ ఎన్కేపల్లి, అమ్డాపూర్, కేతిరెడ్డిపల్లి గ్రామాల్లో జిల్లా పరిషత్ పాఠశాలలు, నాగిరెడ్డిగూడ, ముర్తుజాగూడ, శ్రీరాంనగర్ గ్రామాల్లో ప్రాథమికోన్నత పాఠశాలలు, కుతుబుద్దీన్‌గూడ, ఎల్కగూడ, సురంగల్, చాకలిగూడ, చిన్నషాపూర్, సజ్జన్‌పల్లి, నక్కలపల్లి, అప్పారెడ్డిగూడ, మోత్కుపల్లి, అప్పోజిగూడ, ఎతుబార్‌పల్లి గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఎంపికయ్యాయి. మౌలిక వసతుల కోసం ప్రతి పాఠశాలకూ రూ.లక్ష మంజూరు చేసింది. పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కలెక్టర్ శశాంక గత నెల 31వ తేదీన పాఠశాలలను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# పెండింగ్ పనులను పూర్తి చేయండి



**బడంగ్‌పేట,తెలంగాణ దిశ:** తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే చాంబర్‌లో మున్సి పాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోఉన్న డివిజన్ల వారీగా ఉన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయని అడిగారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గతంలో శంకుస్థాపన చేసిన పనులను త్వరగా పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌పై చర్చించారు. అధికారులు వర్షాకాలంలో అందుబాటులో ఉండాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వార్డుల వారీగా ఉన్న సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ వెంకట్రామ్, డీఈ యాదయ్య, ఏఈ భార్గవరెడ్డి, కౌన్సిలర్ సుమన్, రవీనాయక్, చప్పిడి లావణ్యా రాజు తదితరులు పాల్గొన్నారు.

# అడవి బిడ్డల కష్టం తీరేదెన్నడు?




**వీర్నపల్లి,తెలంగాణ దిశ:** పల్లె ప్రాంతాల్లోని జనాల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేరడం లేదు. నిధులతో కూడిన అనుమతుల్లో జాప్యం కారణంగా అటవీప్రాంత వాసులకు వైద్యం గాల్లో దీపంలా మారింది. తొమ్మిదేళ్ల క్రితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయడమే తప్ప భవన నిర్మాణానికి అడుగులు పడకపోవడం ఈ ప్రాంతవాసులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. గతేడాది స్థల సేకరణతో గ్రహణం వీడిందనుకున్నప్పటికీ ఎన్నికల కోడ్ రూపంలో అడ్డంకులు ఎదురయ్యాయి. వీర్నపల్లి మండలంలో 17 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 20 వేలకు పైగా జనాభా ఉన్నారు. అన్నీ అటవీ గ్రామాలే కావడంతో ఇక్కడ గిరిజన జనాభా అధికంగా ఉంది. ప్రస్తుతం రెండు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా జనాలకు వైద్య సేవలు అందుతు న్నాయి. అప్పటి ఎంపీ బి.వినోద్‌కుమార్ వీర్నపల్లిని దత్తత తీసుకున్నారు. అటవీ గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి 2015 సంవత్సరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయించారు. ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోవడంతో ఏళ్ల తరబడి నిర్మాణానికి అడ్డంకులు ఎదురయ్యాయి. దీంతో భవన నిర్మాణానికి నిధుల కేటాయింపు జరగలేదు. కలెక్టర్ అనుమతితో గతేడాది అటవీశాఖకు చెందిన రెండెకరాల స్థలాన్ని భవన నిర్మాణానికి అప్పగించారు. రూ. 1.7 కోట్లు భవన నిర్మాణానికి అవసర మవుతా యని వైద్యఆరోగ్యశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. తర్వాత ఎన్నికల కోడ్ కారణంగా నిధుల కేటాయింపు, నిర్మాణానికి అనుమతులు లభించలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసింది. ప్రజాప్రతి నిధులతోపాటు అధికారులు నిర్మాణంపై దృష్టి సారిస్తే ఇక్కడి జనాలకు మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంది. ఇక్కడి ప్రాంతవాసులు వాతా వరణ మార్పుల కారణంగా వచ్చే కాలానుగుణ వ్యాధులు సంక్రమిస్తే మెరుగైన వైద్యం పొందడంలో కొంత ఆలస్యమవుతుంది. గర్భిణులు నెల వారి తనిఖీలకు ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పురిటి నొప్పులతో బాధ పడే క్రమంలో ఆసుపత్రి దగ్గర్లో లేక మధ్యలోనే ప్రసవం జరిగిన ఘటనలు వెలుగుచూస్తున్నాయి. అనారోగ్యానికి గురైన జనాలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరు సొంత వైద్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటయితే 12 గంటల పాటు వైద్య సేవలు అందుతాయి. అన్ని రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. గర్భిణులకు సాధారణ ప్రసవాలు చేసే అవకాశం సీజనల్ వ్యాధుల సమయంలో వెంటనే క్షేత్రస్థాయి పర్యటనలు చేయవచ్చు. గుర్తించేం దుకు అవకాశం ఉంటుంది. గర్భిణులకు ఇక్కడే పరీక్షలు నిర్వహించవచ్చు. వైద్యాధికారి, ఏఎన్ఎంలు, ఆరోగ్య పర్యవేక్షకుల తోపాటు సిబ్బంది అందుబాటులో ఉంటారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంటాయి.

# ఉపాధి'తో పంట కాలువలకు మహర్దశ



**అనంతపురం,తెలంగాణ దిశ:** జిల్లాలో సాగు నీటి రంగాన్ని గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఐదేళ్లుగా పైసా ఖర్చు పెట్టలేదు. ప్రధాన కాలువలే కాదు... పంట కాలువలన్నీ దయనీయ దుస్థితికి చేరాయి. దీంతో తుంగభద్ర నుంచి అరకొరగా ప్రవహించే జలాలు సైతం సాఫీగా ముందుకు వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీల్లో(పంట కాలువలు) పేరుకపోయిన పూడిక, ఏపుగా పెరిగిన ముళ్లకంపలు, చెత్తాచెదారమే కారణం. కొత్తగా కొలువుదీరిన తెదేపా ప్రభుత్వం సాగునీటి రంగంపై దృష్టి సారించింది. ఎక్కడికక్కడ ప్రధాన కాలువలే కాదు.. పంట కాలువలను సైతం బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఈమేరకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలతో జలవనరుల శాఖ రంగంలోకి దిగింది. ఉపాధి హామీ నిధులతో పంటకాలువలకు మహర్దశ పట్టనుంది. కాలువల్లో పూడిక, ముళ్లకంపల తొలగింపు ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు. హెచ్చెల్సీ, డ్వామా అధికారుల సమన్వయంతో ఈ పనులకు పూనుకుంటున్నారు. ఇప్పటికే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ అంశంపై ఇటీవల కలెక్టర్ అధికారులతో సమీక్ష జరిపారు. తొలి ప్రాధాన్యతగా పంటల కాలువలను శుభ్రం చేయాలని సంకల్పించారు. హెచ్ఎల్ఎంసీ పరిధి కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లోని కీలకమైన పది డిస్ట్రిబ్యూటరీలపై దృష్టి పెట్టారు. మొత్తం 156 కి.మీ. మేర పూడికతీత, ముళ్లకంపలు తొలగింపు పనులు చేపడతారు. హెచ్చెల్సీ కింద మొత్తం 2.85లక్షల ఎకరాలు ఉంటే... ఇందులో ఒక్క అనంత జిల్లా పరిధిలోనే 1.43 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. హెచ్ఎల్సీ ప్రధాన కాలువ, జీబీసీ, గుత్తి ఉప కాలువ, ఎమ్పీఆర్ ఉత్తర, దక్షిణ కాలువలు, తాడిపత్రి ఉప కాలువ కిందే ఆయకట్టు ఉంది. ఈ కాలువల పొడవు 337.49 కి.మీ. ఉన్నాయి. వీటి కింద మొత్తం 101 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. 2014–19 మధ్య తెదేపా హయాంలో జీబీసీ, ఎమ్పీఆర్ దక్షిణ, ఉత్తర కాలువల ఆధునికీకరణ సింహభాగం పూర్తి అయ్యాయి. తర్వాత వైకాపా ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. ఈనేపథ్యంలో ఎమ్పీఆర్ దక్షిణ, ఉత్తర కాలువల కింద కొంతమేర పనులు మొదలయ్యాయి. పనులన్నీ జులై 15వ తేదీ నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు.

# ఖరారు కాని టెండర్లు.. తొలగని వ్యర్థాలు



**బంగారుపాళ్యం,తెలంగాణ దిశ:** స్థానిక మామిడి కాయల మార్కెట్ యార్డు దుర్గంధభరితంగా మారింది. దీంతో వ్యాపారులు, రైతులు, మండీ వ్యాపారులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. కుప్పం, పలమనేరు, పూతలపట్టు, చిత్తూరు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లోని మండలాల నుంచి రైతులు మామిడి కాయలు వాహనాల్లో ఇక్కడకు విక్రయించేందుకు తీసుకొస్తారు. కాయలను గ్రేడింగ్ చేసి చెడిన, దెబ్బతిన్న వాటిని మండీల ముందు కుప్పలుగా పోస్తారు. వీటిని యార్డు అధికారులు ఎప్పటికప్పుడు తొలగించాలి. ఏటా మామిడికాయల సీజన్ ప్రారంభం ముందే మామిడి కాయల వ్యర్థాల తొలగింపునకు అధికారులు టెండర్లు నిర్వహించేవారు. అధిక ధరలకు టెండరు వేసిన వారికి ఖరారు చేసేవారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభమై నెల రోజులు గడిచినా టెండర్లు ఆహ్వానించలేదు. దీంతో యార్డులో వ్యర్థాలు కుప్పలుగా పేరుకుని వర్షాలకు కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. అంటువ్యాధులు ప్రబలుతాయని వ్యాపారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక యార్డులో ఏటా క్యాంటీన్ ఏర్పాటు చేసి అల్పాహారం అందుబాటులో ఉంచేవారు. ఈ ఏడాది క్యాంటీన్ నిర్వహణకు సైతం నేటికీ టెండర్లు ఖరారు కాలేదు. రైతులు, వ్యాపారులు మార్కెట్ యార్డు ముందున్న ప్రైవేటు దుకాణాల వద్దకు వెళ్తున్నారు. దీంతో యార్డు ఆదాయానికి గండిపడుతోంది. ఈ విషయమై మార్కెట్‌యార్డు పర్యవేక్షణాధికారి గంగయ్యను వివరణ కోరగా.. త్వరలో టెండర్లు నిర్వహిస్తామని, వ్యర్థాలు తొలగించి, క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని వివరించారు.

# అధికారుల్లో చలనం కరవు



**పుత్తూరు,తెలంగాణ దిశ:** జిల్లాలోని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థ, గ్రామాల్లోను చాపకింద నీరులా అతిసారం వ్యాప్తి చెందుతోంది. నెలన్నర క్రితం కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురంలో మునెమ్మ అతిసారంతో మృత్యువాత పడింది. పుత్తూరు మున్సిపాలిటీలోని నందిమంగళంలో 15 రోజులుగా అతిసారతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అందులోనూ ఇద్దరు మృత్యువాత పడ్డారు. నందిమంగళం గ్రామంలో జాతర సందర్భంగా కలుషిత ఆహారం వల్ల గ్రామానికి చెందిన 15 మంది ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందారని, అంతా సర్దుబాటు అయిందని మొదట్లో గ్రామస్థులు పేర్కొన్నారు. మరో నాలుగైదు రోజుల అనంతరం నందిమంగళం దళితవాడలో అతిసారం ముసురుకుంది. దీంతో అధికారులు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం, తాగునీటి పైపులైన్లు మార్చడం, తాగునీటి సరఫరా చేపట్టి అదుపులోకి తెచ్చారు. పలమనేరు మండలం టి.ఒడ్డూరులో కలుషిత ఆహారం వల్ల 34 మంది ఆస్పత్రి పాలయ్యారు. బైరెడ్డిపల్లి మండలం కొత్తయిండ్లు గ్రామంలో మరో ఆరుగురు అతిసారంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. కలుషిత నీటి కారణంగానే అతిసారం సోకిందని అధికారులు గుర్తించి చర్యలకు ఉపక్రమించడం గమనార్హం. ముందుగా చర్యలు తీసుకుని ఉంటే..: ఏటా నైరుతి రుతుపవనాల సమయంలో జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతుంటాయి. తూర్పు మండలాల్లో ఓ మోస్తారు వర్షాలు కురుస్తుంటాయి. ఈ ఏడాది ముందస్తుగానే వాతావరణ శాఖ నైరుతిలో ఆశించిన వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు మేల్కొని ఉంటే ఈ ఉపద్రవం జరిగేది కాదని ప్రజలు వాపోతున్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు సైతం చేతుల కాలాక ఆకులు పట్టుకున్న చందంలా శిబిరాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారు. అతిసార బాధితులను అటు నగరి ఏరియా ఆస్పత్రికి, ఇటు తిరుపతికి పంపుతుండటం గమనార్హం. పుత్తూరు నగరి, పలమనేరు, కుప్పం, పుంగనూరు మున్సిపాలిటీలు, చిత్తూరు నగరపాలక సంస్థతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ సమస్యలు గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉంది. గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నా.. : గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసిందిజ శానిటరీ సెక్రటరీలు పారిశుధ్య పనులతో పాటు ఏదైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలి. అయితే ఆ దిశగా మాత్రం చర్యలు శూన్యం.

# మీ సహకారం ఇక చాలు!




**సీతానగరం,తెలంగాణ దిశ:** తూర్పుగోదావరి జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(సింగిల్ విండో) నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి త్రిసభ్య కమిటీల గడువు ఈ ఏడాది జులై నెలాఖరుకు ముగియనుంది. జిల్లా మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ల సెవెన్‌మెన్ కమిటీలకు వచ్చేనెల 17తో నామినేటెడ్ పదవీకాలం పూర్తవనుంది. గత వైకాపా ప్రభుత్వం కమిటీల పేరిట వారికే పదవులు అంటగట్టి ఆరు నెలలకోసారి పొడిగిస్తూ పాలకవర్గాల ఊసే లేకుండా చేసింది. వైకాపా 2019లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సహకార పరపతి సంఘాలు ఆ పార్టీ చేతుల్లోకి వెళ్లడంతో చిన్న, సన్నకారు రైతులంతా పడరాని పాట్లు పడ్డారు. త్రీమెన్ కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి. గతంలో సహకార పరపతి పొందాలంటే రైతులు సంబంధిత సీఈవోకు అవసరమైన దస్త్రాలు ఇస్తే సరిపోయేది. వాటిని సరిచూసుకుని కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రుణాలు అందించేవారు. గత ఐదేళ్లుగా రుణాలు తీసుకోవాలంటే వైకాపా ముద్ర పడితేనే త్రీమెన్ కమిటీలు అంగీకరించేవి. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రం వరకు వారి పాలన నిండిపోవడంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో సొసైటీల సీఈవోలు ఉండిపోయారు. పార్టీలతో సంబంధం లేకుం డా రుణాలు ఇవ్వాలని రాజానగరం నియోజకవర్గానికి చెందిన ఒకరిద్దరు సీఈవోలు నోరు విప్పితే త్రీమెన్ కమిటీల నుంచి వారికి బెదిరింపులు తప్పలేదు. ఆ కమిటీలు చెప్పిన వారికే సహకార బ్యాంకు ద్వారా పంట రుణాలిచ్చారు. దీంతో అందులో ఉండేందుకు ఆ పార్టీలో పోటీ పెరిగింది. ఆరు నెలలకోసారి మారే పదవులు తమకు ఇవ్వకపోతే పార్టీ మారతామనే ధోరణిలో ద్వితీయ శ్రేణి నాయకత్వాలు ఉండేవి. సహకార పరపతి సంఘాల పాలకవర్గాలకు 2018 లోనే గడువు ముగిసింది. 2019లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అప్పటి తెదేపా ప్రభుత్వం ఏడాది కాలం అఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జులను నియమించింది. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఎన్నికల జోలికి వెళ్లకుండా త్రిసభ్య కమిటీలు, డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు సెవెన్‌మెన్ కమిటీలను నియమించింది. వాటి గడువును ప్రతి ఆరు నెలలకోసారి పొడిగించుకుంటూ వచ్చింది. వైకాపా వారే త్రీమెన్ సభ్యులుగా ఉండడం వల్ల సొసైటీలకు సంబంధించిన కొంత నగదును సైతం సొంత పనులకు ఉపయోగించకునే పరిస్థితులు ఉండేవంటున్నారు. ఆడిట్ సమయంలో సర్దుబాటు చేస్తామంటూ సీఈవోలపై ఒత్తిళ్లు చేయడంతో ఉద్యోగులు బిక్కు బిక్కుమంటూనే ఐదేళ్లు గడిపారు. ఈ సెలవు దినం కావడంతో 10వ తేదీ వరకు రాజీనామా పత్రాలు తీసుకున్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ల పరిధిలో 107 సొసైటీలకు గాను గడువు ముగిసే సరికి 94 మంది మాత్రమే రాజీనామాలు చేశారు. సమయం ముగిసినా వీరు తప్పుకోకపోవడంపై ఆ శాఖ అధికారులు కన్నెర్ర చేశారు. జిల్లావ్యాప్తంగా డీసీసీబీ, డీసీఎంఎస్‌లతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు అఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జులను రెండు రోజుల్లో నియమించేలా ఉత్తర్వులు జారీ చేసినట్లు డీసీవో శ్రీరాములు నాయుడు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ప్రభుత్వం నుంచి జీవో వచ్చిన తర్వాతనే త్రీమెన్, సెవెన్‌మెన్ కమిటీలు ఉంటాయన్నారు.

# పురపాలక వాహనాల నిర్వహణపై నిర్లక్ష్యం




**కొత్తగూడెం,తెలంగాణ దిశ:**కొత్తగూడెం పురపాలకంలో చెత్తను తరలించే ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటో ట్రాలీలకు కనీసం బీమా చేయించడం లేదు. కొంతకాలంగా ఆయా వాహనాల నిర్వహనను అధికార యంత్రాంగం గాలికొదిలేసింది. నిత్యం రహదారులపై తిరిగే వాహనాలకు కనీసం బీమా చేయించకపోవడం ఏమిటని పుర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా జరిగితే బాధిత కుటుంబాలను ఎవరు ఆదుకుంటారని నిలదీస్తున్నారు. పురపాలకంలో మొత్తం 36 వార్డులున్నాయి. ఇంటింటా చెత్త సేకరణకు వార్డుకు ఒకటి చొప్పున స్వచ్ఛ ఆటో ట్రాలీలను కేటాయించారు. గతంలో అనుభవం గల ఆటో డ్రైవర్లు వీటిని నడిపేవారు. పురపాలకం వేతనాలు ఇవ్వకపోవడం, యూజర్ ఛార్జీలు వసూలు చేసుకునే పరిస్థితులల్లేక చాలామంది విధులను మానేశారు. ఈ క్రమంలో సరైన అనుభవం, అర్హత లేని వారితో వాహనాలను నడిపస్తూ అధికార యంత్రాంగం పబ్బం గడుపుతోంది. చెత్త వాహనాలు నడిపేవారికి లైసెన్స్‌తో పాటు బ్యాడ్జీలు తప్పనిసరిగా ఉండాలనేది నిబంధన. కానీ 'గూడెం'లో అసలు లైసెన్సే లేనివారికి వాహనాల్ని అప్పగించేశారు. వార్డుల్లో చెత్త పేరుకుపోతే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనే భయంతో స్థానిక కౌన్సిలర్లు కూడా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఇతర వాహనాల విషయంలోనూ బీమా చేయించడంలో నిర్లక్ష్యం చేస్తుండటం అధికారుల వంతవుతోంది. గతంలో ఓ పారిశుద్ధ్య కార్మికురాలు ట్రాక్టర్ పై నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోయింది. ఆ వాహనానికి బీమా లేకపోవడంతో బాధిత కుటుంబానికి పరిహారం దక్కలేదు. అయినా యంత్రాంగంలో మార్పు రావడం లేదు. సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సూరెన్స్ లేని వాహనాలను రోడ్లపై తిప్పుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ విషయంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరభద్రాచారి 'న్యూస్‌టుడే' వివరణ ఇస్తూ.. 'లైసెన్స్, పత్రాల్లేకుండా స్వచ్ఛ ట్రాలీలు నడిపే నిర్వాహకులతో వెంటనే మాట్లాడతాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. పురపాలక ట్రాక్టర్లకు కాల పరిమితి ముగిసిన వెంటనే బీమా రెన్యువల్ చేయించాం. స్వచ్ఛ వాహనాలకూ జీవితకాల బీమా చేయించాం' అని అన్నారు.

# నిర్మాణం పూర్తయినా.. నిరుపయోగం



జనగామ: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన ఆరోగ్య పరిరక్షణ, యోగా సాధన కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రోజు రోజుకు పెరుగుతున్న యోగా ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని జిల్లాల్లో ఆయుష్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సాధన చేయడానికి ఆరోగ్య స్వస్థత కేంద్రాలను(హెల్త్ వెల్‌నెస్ సెంటర్) ఏర్పాటు చేస్తున్నారు. జనగామ జిల్లాకు కూడా రూ.54 లక్షల వ్యయంతో 9 సెంటర్లు మంజూరు చేయగా, ఏడాదిన్నర క్రితమే 8 కేంద్రాల నిర్మాణం పూర్తి చేయగా, జనగామ పట్టణంలో మాత్రం భూసేకరణ సమస్యతో నిర్మాణం జరగలేదు. పూర్తయిన చోట నిర్వీర్యం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 9 ఆరోగ్య స్వస్థత కేంద్రాలను ఆయుష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడానికి పనులను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. జిల్లాలోని పెద్దమడూరు, చెన్నూరు, పెంబర్తి, పడమటికేశ్వాపూర్, తాటికొండ, ఛాగల్, అశ్వరావుపల్లి, నవాబ్‌పేట గ్రామాల్లో ఆరోగ్య స్వస్థత కేంద్రాల నిర్మాణం పూర్తి చేశారు. జనగామ పట్టణంలో తొలుత కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వ స్థలం లభించలేదు. ఇటీవలే పట్టణంలోని ధర్మకంచలో ఉన్న అర్బన్ పీహెచ్‌సీలో వెనుక వైపు అందుబాటులో ఉన్న ఖాళీ నిర్ణయించారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నట్లు తెలిసింది. అయితే ఇతర గ్రామాల్లో పూర్తయిన ఎనిమిది కేంద్రాలు ఏడాదిన్నరగా నిరుపయోగంగా ఉంటున్నాయి. దీనికి కారణం ఆయా కేంద్రాల్లో యోగా శిక్షకుల నియామకం పూర్తి కాలేదు. తొలుత ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇప్పించాలని యోచించినా, వారికి ఇతర పని ఒత్తిడి వల్ల ఆలోచనను విరమించుకున్నారు. దీనికి ఆయా గ్రామాల్లో ఉన్న నిరుద్యోగులనే ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. యోగాలో డిప్లొమాతో పాటు అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

త్వరలో రాష్ట్ర స్థాయిలో శిక్షకుల ఎంపిక జరుగనుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులపై వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులకు కాన్పు కంటే ముందు వారికి అవసరమైన యోగాసనాలను నేర్పించాలని యోచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల సాధారణ కాన్పులు అయ్యే వీలుంటుందని ఆయుష్ అధికారులతో పాటు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. అలాగే అన్ని వయసులు, వర్గాల ప్రజలు కూడా సాధన చేయడానికి ఈ కేంద్రాలు ఉపయోగించుకునే వీలుంటుందని చెపుతున్నారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా సిద్ధంగా ఉన్న ఆరోగ్య స్వస్థత కేంద్రాలను ప్రారంభించడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లోనూ యోగా కేంద్రాలు అందుబాటులోకి వచ్చినట్లుగా ఉంటుందని భావిస్తున్నారు. జిల్లాలో నిర్మాణం పూర్తయిన ఆరోగ్య స్వస్థత కేంద్రాలను త్వరలో ప్రారంభించడానికి చర్యలు చేపడతాం. శిక్షకులు లేని విషయాన్ని రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో నియామకం ఉంటుంది, తర్వాత ప్రారంభం ఉంటుంది. ప్రారంభిస్తే గర్భిణులతో పాటు సాధారణ ప్రజలు కూడా వినియోగించుకునే వీలుంటుంది.

# వరుణుడి జోరు.. సాగు హుషారు



**ఖమ్మం,తెలంగాణ దిశ:** అదును మీదపడటంతో అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే మొలకెత్తిన పైర్లకు కలుపు తీయడం, ఎరువులు అందించడం, పురుగు మందులు పిచికారీ చేయడం వంటివి చేస్తున్నారు. వరి సాగు చేసే రైతన్నలు నార్లు పోసేందుకు సిద్ధమయ్యారు. ఆయిల్‌పాం అనగానే రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుర్తురాక మానదు. జూన్ నాటికి 64 వేల ఎకరాలకు పైగా తోటలు విస్తరించడం విశేషం. వీటితో పాటు వేలాది ఎకరాల్లో సాగయ్యే ఉద్యాన పంటలకు తాజా వర్షాలతో మేలు కలుగుతుంది. ఖమ్మం జిల్లాతో పోల్చిచూస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వరుణుడి జోరు ఎక్కువే. ఇటీవలి నుంచి భారీ వర్షాలు నమోదవుతున్నాయి. అన్ని మండలాల్లోనూ సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. ఆదివారం నాటి పరిస్థితిని పరిశీలిస్తే జిల్లాలో మొత్తం 1,024.6 మి.మీ., సగటున 44.5 మి.మీ. వర్షం కురిసింది. కరకగూడెం 18, పినపాక 27.2, చర్ల 36.6, దు మ్ముగూడెం 38.6, అశ్వాపురం 58.6, మణుగూరు 64.6, ఆళ్లపల్లి 31.4, గుండాల 48.6, ఇల్లెందు 10.8, టేకులపల్లి 34.2, జూలూరుపాడు 70.2, చంద్రుగొండ 64., అన్నపురెడ్డిపల్లి 32.2, చుంచుపల్లి 54, సుజాతనగర్ 31.2, కొత్తగూడెం 56, లక్ష్మీదేవిపల్లి 33.4, పాల్వంచ 44.4, బూర్గంపాడు 72.4, భద్రాచలం 77.2, ములకలపల్లి 94.4, దమ్మపేట 12.2, అశ్వారావుపేట మండలంలో 14.4 వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం అన్ని రకాల పంటల సాగు పనులకు అనుకూల వాతావరణం ఏర్పడింది. పొడి దుక్కిలో విత్తనాలు వేసిన పత్తి రైతులు ఇప్పటికే పైరులో మొదటి పాటు (చెట్ల మధ్య దున్నడం) మొదలు పెట్టారు. ఇతర మెట్ట పంటలైన పెసర, కంది, మొక్కజొన్న, పచ్చిరొట్ట ఏపుగా పెరిగేందుకు వర్షాలు తోడ్పడనున్నాయి. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, ఇతర జలాశయాల్లోకి ప్రవాహం భారీగా చేరుతోంది. ఆయకట్టు పరిధిలోని రైతులు వరి నార్లు పోస్తున్నారు.

# బకాయిల ఊబిలో సింగరేణి




**భూపాలపల్లి,తెలంగాణ దిశ:**భూపాలపల్లి సింగరేణి డివిజన్‌లో కార్మికుల, అధికారుల క్వార్టర్లు, భవనాలను అద్దెకు తీసుకున్న ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు కొందరు నెలవారీగా అద్దె చెల్లించటం లేదు. సకాలంలో సింగరేణికి అద్దె చెల్లించకపోవడంతో విద్యుత్తు బిల్లులు, తాగునీరు. తదితర నిర్వహణ ఖర్చుల భారం పెరుగుతోంది. భూపాలపల్లి ఏరియాలోని క్వార్టర్లు, భవనాల్లో నివాసం ఉంటున్న రెవెన్యూ, ఫారెస్టు, పోలీసు, తదితర శాఖల అధికారులే కాకుండా పలువురు ప్రజా ప్రతినిధులు చెల్లించాల్సిన ఇంటి అద్దె బకాయిలు రూ.2.15 కోట్ల వరకు ఉన్నాయి. కార్మికులు క్వార్టర్లు సకాలంలో ఖాళీ చేయకుంటే, వారి వేతనాల నుంచి అద్దె డబ్బులు రికవరీ చేస్తారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు సకాలంలో క్వార్టర్లు ఖాళీ చేయకుంటే, వారికి వచ్చే డబ్బులను నిలుపుదల చేస్తారు. సింగరేణి అధికారులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, రాజకీయ నాయకులు తీసుకున్న క్వార్టర్లకు, భవనాలకు ఎందుకు అద్దె వసూలు చేయటం లేదని పలువురు కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఒక వైపు వందల సంఖ్యలో సింగరేణి కార్మికులు క్వార్టర్ల సౌకర్యం లేక అద్దె ఇళ్లలో రూ.వేలకు వేలు ఇంటి అద్దె చెల్లిస్తున్నారు. మరికొందరు నివాస గృహాలు లేక చుట్టుపక్కల గ్రామాల్లో నివాసం ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు.

భూపాలపల్లి జిల్లా ఆవిర్భావం నుంచే సింగరేణి యాజమాన్యం కోట్లాది రూపాయలు వెచ్చిన సింగరేణి అధికారులకు, కార్మికులకు నివాస గృహాలు వివిధ శాఖల అధికారులకు, ఇతర సిబ్బందికి కేటాయించారు. ముఖ్యంగా కలెక్టర్ కార్యాలయానికి కూడా మంజూరునగర్ ప్రాంతంలో నిర్మించిన ఓ అతిథి గృహాన్ని కేటాయించిన విషయం తెలిసిందే. ఇందులో సుమారు పది ప్రభుత్వ శాఖల కార్యాలయాలు కొనసాగాయి. గతేడాది నవంబరు మాసంలో సింగరేణి అతిథి గృహంలో కొనసాగిన కలెక్టర్ కార్యాలయం మంజూరునగర్ ప్రాంతంలోని వంద పడకుల ఆసుపత్రి సమీపంలో నిర్మించిన కొత్త సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోకి మార్చారు. దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఇందులోకే వచ్చాయి. ఇక్కడి వరకు మంచిగానే ఉంది. 2017 నుంచి ఇప్పటివరకు సింగరేణి సంస్థకు చెల్లించాల్సి అద్దె చెల్లించకపోవడంతో బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయి. భూపాలపల్లి ఏరియాలో సింగరేణి యాజమాన్యం నిర్మించిన దాదాపు 135 క్వార్టర్లు, భవనాలు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులకు, ఉద్యోగులకు, రాజకీయ నాయకులకు అద్దెకిచ్చారు. వీటిలో నివాసం ఉంటున్న కొందరు అద్దె బకాయిలు ఎందుకు చెల్లించాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మరి కొందరు ఇక్కడ అద్దెకు ఉండి ఇతర ప్రాంతాలకు వెళ్లిన అధికారులు చెల్లించటం లేదు. బదిలీపై వెళ్లిన అధికారులు, సిబ్బంది కుటుంబీకులు సింగరేణి క్వార్టర్లలో నివాసం ఉంటున్నా అద్దె అడిగితే క్వార్టర్ తమ పేరుతో లేదని సమాధానం చెబుతున్నారు. సింగరేణికి సంబంధించిన క్వార్టర్లు, భవనాల్లో నివాసం ఉంటున్న పలు శాఖల అధికారులు చెల్లించాల్సిన అద్దె బకాయిల వసూళ్లపై ఒత్తిడి పెంచుతున్నాం. ఇటీవల వీటి విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. కొంత మంది నివాసం ఉంటున్న ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తే, బకాయిలు చెల్లించారు. ఇప్పటికే మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేశాం. ఖాళీగా ఉన్న 300 క్వార్టర్లను త్వరలో అర్హులైన కార్మికులకు అప్పగిస్తాం.

# బ్యాంకర్లు సకాలంలో పంట రుణాలు అందించాలి: కలెక్టర్



**కొత్తగూడెం,తెలంగాణ దిశ:**ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు సకాలంలో పంట రుణాలు అందించాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఆదేశించారు. బ్యాంకర్లతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా రైతులకు రూ.2,710 కోట్ల పంట రుణాలు అందించాలనే లక్ష్యాన్ని నిర్దేశించి నట్లు చెప్పారు. ఇప్పటివరకు రూ.1,400.24 కోట్లను విడుదల చేశా మన్నారు. రుణాల రెన్యువల్‌పై బ్యాంకులు ప్రత్యేక క్యాంపులు నిర్వ హించి అవగాహన కల్పించాలని తెలిపారు. రైతు భరోసా, రైతుబీమా, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన సాయాన్ని రుణ బకాయిల కింద జమచేసుకోవడానికి వీలు లేదని స్పష్టం చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులు లక్ష్యం మేరకు రుణాలు అందించాలని ఆదేశించారు. యువతకు ఉపాధి రుణాలు అందించి ప్రోత్స హించాలన్నారు. గిరిజ నులకు కూరగాయల సాగు, నర్సరీల పెంపకం, కోల్డ్ స్టోరేజీలు, వ్యవసాయ పరికరాల కొనుగోలుకు రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. నాబార్డ్ రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. డీఆర్‌డీఓ విద్యాచందన, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, డీడబ్ల్యూఓ సంజీవరావు, డీహెచ్ఓ సూర్యనారాయణ, ఏడీఏ రవి, ఆర్‌బీఐ అధికారులు పృథ్వీ, సుజీత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. 'ధరణి' దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సీసీ ఎల్ఏ కమిషనర్ నవీన్ మిత్తల్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా క్షేత్రస్థాయి విచారణ చేపట్టి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు.

# వ్యాధుల కాలం.. అప్రమత్తతే కీలకం



**ములుగు,తెలంగాణ దిశ:** వర్షాలు అడపాదడపా కురుస్తున్నాయి. పల్లెలు, పట్టణాల్లో అపరిశుభ్రం నెలకొంటోంది. గుంతలు, మురుగు కాల్వలు, ఖాళీ స్థలాల్లో నిలిచే నీరు మశకాలకు ఆవాసంగా మారుతున్నాయి. కీటక, నీటిజనిత వ్యాధులకు ఊతమిస్తున్నాయి. ముసురుకొస్తున్న వ్యాధుల ముప్పు అధికారుల్లో అప్రమత్తతను హెచ్చరిస్తోంది. జిల్లా పరిధిలో 419 గ్రామాల్లో 3.52 లక్షల జనాభా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ములుగు జిల్లా ఆసుపత్రి, వెంకటాపురం, ఏటూరునాగారంలో సీహెచ్‌సీలు, 15 పీహెచ్‌సీలు జిల్లాలో ఉన్నాయి. అనుబంధంగా పల్లెస్థాయిలో 51 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు, 38 ఆరోగ్య ఉప కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇదంతా ఓ వైపు కాగా.. వైద్యులు, సిబ్బంది కొరతతో గ్రామీణంలో సకాలంలో సేవలు అందని పరిస్థితి ఉంది. ఇది వ్యాధుల ముప్పెట దాడికి ప్రతీ ఏటా కారణమవుతోంది. వ్యాధులు వ్యాప్తి చెందటంపై వైద్యశాఖ అప్రమత్తమైంది. ఇందుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలసల కారణంగానే దోమల వ్యాప్తి చెందుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా గొత్తికోయ గూడేలపై ఈ ఏడాది ప్రత్యేక దృష్టి సారించేలా ప్రణాళిక చేసింది. జిల్లాలో 60కి పైగా గొత్తికోయగూడేల్లో 6,426 మంది నివసిస్తున్నట్లు క్షేత్రస్థాయి సర్వే ద్వారా తేల్చారు. ఈ గూడాల్లో వ్యాధులపై చైతన్యం కలిగించడం, ఛత్తీస్‌గఢ్ నుంచి రాకపోకలు సాగిస్తే ముందస్తు ఏర్పాట్లు చేసుకునేలా చొరవ చూపుతున్నారు. దోమతెరల ఊసేలేదు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రభావిత పల్లెలకు అందాల్సిన తెరలు గ్రామాలకు చేరలేదు. రెండేళ్ల కిందట సరఫరా చేపట్టగా, ప్రస్తుత ఏడాదికి వైద్యశాఖ ఎదురుచూస్తోంది. జిల్లా వ్యాప్తంగా 34 వేల దోమతెరలు అవసరం ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించినట్లు వైద్యశాఖ చెబుతోంది. వానాకాలానికి ముందే రావాల్సిన ఈ సామగ్రి నేటికీ అందకపోవడం గుబులు కలిగిస్తోంది. దోమల నివారణకు పిచికారి సైతం నెమ్మదిగానే సాగుతోంది. వ్యాధుల కాలం ఆరంభానికి ముందే జిల్లాలోని పలు ప్రాంతాల్లో మలేరియా, డెంగీ కేసులు నమోదయ్యాయి. కన్నాయిగూడెం, రొయ్యూరు, కొడిశాల, తాడ్వాయి, పస్రా, వాజేడు, పేరూరు, ఎదిర తదితర ఎనిమిది పీహెచ్‌సీల పరిధిలోని 15 ఆరోగ్య ఉప కేంద్రాలు మలేరియా ప్రభావిత ప్రాంతాల జాబితాలో చేరాయి. ఈ పరిధిలోని 123 గ్రామాలు తీవ్ర ప్రభావిత పల్లెలుగా వైద్యశాఖ నిర్ధారించింది. దోమకాటు ప్రభావిత ప్రాంతాలతో పాటు ఇతర పల్లెల్లోనూ ఈ ఏడాది మే నాటికి 13 మలేరియా, 4 డెంగీ కేసులు నమోదయ్యాయి. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో తీవ్రంగా శ్రమిస్తేనే కాలానుగుణ వ్యాధులను కట్టడి చేయొచ్చు. ఇందుకు ప్రభుత్వశాఖల్లో సమన్వయం అవసరం.

# మీ-సేవలో.. అక్రమాలకు చెక్




**రాజపేట,తెలంగాణ దిశ:** వేగంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో అప్పట్లో ప్రభుత్వం మీ-సేవ కేంద్రాల వ్యవస్థను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా ధ్రువపత్రాలు, ఇతర అవసరాలకు రైతులు, విద్యార్థులు రాతపూర్వక దరఖాస్తు చేసుకునే వారు. ఇప్పుడంతా ఆ సేవలన్నీ మీ-సేవ కేంద్రాల్లోనే కొనసాగుతున్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించిన సేవలు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇందులో ఆయా సేవలకు సంబంధిత రుసుంలను ప్రభుత్వం నిర్దేశించింది. ఆ రుసుం వివరాలను వినియోగదారులు కనిపించేలా కేంద్రాల్లో బోర్డులు ప్రదర్శించాలి. యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రభుత్వ, టీఆర్ఎన్, టీజీటీఎస్ కలిపి మొత్తంగా 76 మీ సేవ కేంద్రాలున్నాయి. కొందరు నిర్వాహకులు నిర్దేశించిన రుసుంతో పాటు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు గత కొంత కాలంగా ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం నగదు రహిత చెల్లింపుల విధానానికి శ్రీకారం చుట్టింది. మీ సేవ కేంద్రాల్లో రుసుం చార్టుల్లో ఉన్న మొత్తానికి, వసూలు చేస్తున్న దానికి పొంతన ఉండటం లేదనే వాదనలున్నాయి. అదనపు వసూళ్లపై ప్రశ్నిస్తే జిల్లాలో అక్కడక్కడ నిర్వాహకులు దురుసుగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇదే విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదులందినా, తరచూ అధికారులు తనిఖీలు చేపట్టినా వ్యవహారంలో మార్పు కనిపించడం లేదనేది వాస్తవం. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో అదనపు వసూళ్లకు అడ్డుకట్ట పడే అవకాశం ఉండనుంది. చెల్లింపులు నగదు రహితం కావడంతో ఎంత వసూలు చేశారన్నది ఉన్నతాధికారులకు ఇట్టే తెలిసిపోతుంది. అదనంగా తీసుకునే వారిపై తక్షణ చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

# సీఎంఆర్ బకాయిల వసూలుకు.. రంగం సిద్ధం



**హుజూర్‌నగర్,తెలంగాణ దిశ:** సీఎంఆర్ బకాయి బియ్యం వసూలు చేసేందుకు అధికారులు అన్ని ప్రయత్నాలు చేశారు. చివరకు బకాయిపడిన మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు లేకుండా చేశారు. అలాంటి మిల్లర్లు రాష్ట్ర వ్యాప్తంగా 60 మంది ఉండగా, ఒక్క సూర్యాపేట జిల్లాలోనే 16 మంది ఉన్నారు. వీరందరినీ డీఫాల్టర్లుగా ప్రకటించారు. కోర్టుకు వెళ్తే తమకు బియ్యం చెల్లింపుపై వాయిదా దొరుకుతుందని వారు అధికారులను బెదిరిస్తూ వచ్చారు. ఒక్క సూర్యాపేటలోనే రూ.64 కోట్ల విలువైన బియ్యం పెట్టాల్సి ఉండటంతో అధికారులు దూకుడుగా వ్యవహరించారు. కోదాడ, సూర్యాపేటలోని కొందరు మిల్లర్లు కోర్టును ఆశ్రయించడంతో వారికి అక్కడ చుక్కెదురైంది. తీసుకున్న ధాన్యానికి బియ్యం వెంటనే ఇవ్వాలని, లేకుంటే ఏసీబీని రంగంలోకి దించుతామని, ఆర్ఆర్ యాక్టునూ అమలు చేస్తారని కోర్టు వ్యాఖ్యానించడంతో పౌరసరఫరాల అధికారులు ఆనందంవ్యక్తం చేస్తున్నారు. మిల్లర్లకు ఇది మింగుడు పడకుండా ఉంది. 2019-20, 2020-21, 2021-22 వానాకాలం,యాసంగి, 2022-23 వానాకాలం సీజన్ల బకాయిల వసూలుకు మిల్లర్లపై కఠినంగా వ్యవహరించడంతో పాటు జప్తులు, అవసరమైతే క్రిమినల్ కేసులైనా నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి.

# బాహ్యావలయ రహదారి నిర్మాణానికి కసరత్తు

**మహబూబాబాద్,తెలంగాణ దిశ:** పట్టణంలో ద్విచక్రవాహనాలతో పాటు ఇతర వాహనాలు కలిపి సుమారు 30 వేల వరకు ఉంటాయని అంచనా. వీటితో పాటు నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే వాహనాలతో సంఖ్య రెట్టింపవుతోంది. పట్టణంలోని ప్రధాన వీధుల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. బాహ్యావలయ రహదారి నిర్మాణంతోనే ఈ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించనుందని పురపాలక సంఘం భావించింది. జిల్లా కేంద్రంలో నలువైపుల సుమారు 11.750 కి.మీ., పొడవులో జాతీయ రహదారులకు అనుసంధానిస్తూ నాలుగు బాహ్యావలయ రహదారుల నిర్మాణం చేపట్టేందుకు ఇటీవల పురపాలకవర్గం నిర్ణయించింది. రహదారి నిర్మాణం ప్రారంభమైన ప్రదేశం నుంచి పూర్తయ్యే వరకు అవసరమయ్యే నిధులపై అంచనాలను తయారు చేసేందుకు సర్వే చేపట్టడానికి రూ. 23.50 లక్షలు కేటాయిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించింది. అనుభవం కలిగిన సంస్థ ద్వారా సర్వే చేబట్టి అనంతరం సమగ్ర నివేదిక(డీపీఆర్) రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదించనుంది. జిల్లా కేంద్రంతో పాటు పట్టణ నలువైపుల నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలకు సాగించే వాహా నాలకు మహబూబాబాద్ కూడలిగా మారింది. మహబూబాబాద్ నుంచి భద్రాచలం, వరంగల్, హైదరాబాద్, ఖమ్మం, సూర్యాపేట ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఎటు వెళ్లాలన్నా పట్టణంలోకి రావలసిన పరిస్థితి ఉండడంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్య అధికమైంది. ఈ సమస్యకు ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ వలిగొండ నుంచి వయా తొర్రూరు, మహబూబాబాద్ మీదుగా ఈ నాలుగు బాహ్యావలయ రహదారి నిర్మాణాలు పూర్తి చేస్తే భద్రాచలం, వరంగల్, ములుగు, సూర్యాపేట, ఖమ్మం, హైదరాబాద్ -తొర్రూరు ప్రాంతాల నుంచి వచ్చే భారీ వాహనాలు పట్టణంలోనికి ప్రవేశించకుండా వెళ్లిపోతాయి.

# పంచాయతీల్లో స్వచ్ఛత ఏదీ?



**పుట్టపర్తి,తెలంగాణ దిశ:** పల్లెసీమలు పరిశుభ్రంగా ఉండాన్న లక్ష్యంతో స్వచ్ఛభారత్ కింద వాహనాలను పంచాయతీలకు కేటాయించారు. గత ప్రభుత్వం నిర్వహణలో నిర్లక్ష్యం, చిత్తశుద్ధి లేకపోవడంతో స్వచ్ఛ వాహనాలు మూలకు చేరాయి. దీంతో చాలా చోట్ల చెత్తసేకరణ ప్రక్రియ ఆగిపోయింది. వీధులు అపరిశుభ్రతగా మారి, రహదారులపైన చెత్తదిబ్బల దర్శనమిస్తున్నాయి. రూ.కోట్లు ఖర్చుచేసి పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులకు స్వచ్ఛభారత్ కింద వాహనాలు ఇచ్చారు. నిర్వహణతోపాటు కార్మికులకు వేతనాలు ఇవ్వక మూలనపడ్డాయి. కనీసం మరమ్మతులు చేయించకపోవడంతో వాహనాలు తుప్పుపట్టాయి. కొన్ని విడిభాగాలు అపహరణకు గురయ్యాయి. జిల్లాలో ఆరు ఆటోలు, 25 ట్రాక్టర్లు, 310 రిక్షాలు మరమ్మతులకు గురికావడంతో ఆపేశారు. వీటికితోడు వాహనాలను నడిపేందుకు 15మంది డ్రైవర్ల కొరత ఉంది. మేజర్ పంచాయతీ తలుపులలో రెండు ట్రాక్టర్లు, ఆటో, పది రిక్షాలు ఉన్నాయి. వాటిలో ఐదు ఆటోలను మూలనపెట్టారు. దీంతో అవి తుప్పుపడుతున్నాయి. మురుగు కాల్వల్లో పూడిక తొలగించే మినీ జేసీబీ నిరుపయోగంగా మారింది. రూ.లక్షల విలువైన జేసీబీని ఆరుబయట పడేశారు. ఫలితంగా పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. కదిరి గ్రామీణం: కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి, పట్నంలో ఆటోలు మరమ్మతులకు వచ్చాయి. కుమ్మవాండ్లపల్లిలో ఆటో బ్యాటరీ అపహరణకు గురైంది. మొటుకుపల్లి, కాళసముద్రం డ్రైవర్లు లేక నిలిపేశారు. మండలంలోని 36 రిక్షాల్లో సగానికి పైగా మూలన పడేశారు. కొత్తగా మంజూరైన వాహనాలను వినియోగించకుండానే తుప్పుపడుతున్నాయి. దీంతో రోడ్లపై చెత్త, వీధుల్లోకి మురుగు చేరుతోంది. పలు పంచాయతీల్లో చెత్తసేకరణ వాహనాల్లో కొన్ని పని చేయడంలేదు. కొన్నింటికి డ్రైవర్ల కొరత ఉంది. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

# అధికార బలం.. అవినీతికి ఊతం



**పుట్టపర్తి,తెలంగాణ దిశ:**గత వైకాపా ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణశాఖ ఏఈ హరిప్రసాద్‌రెడ్డి అవినీతి, అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది. ఎందుకంటే ఆయన అవినీతి కార్యాకలాపాల్లో అప్పటి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు భాగస్వామ్యం ఉంటడమే. ఒక మండలంలో అవినీతికి పాల్పడటం.. మరో మండలానికి బదిలీ కావడం.. ఇలా ఐదేళ్లపాటు ఇష్టారాజ్యంగా ఏఈ వ్యవహరించాడు. జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించకుండానే బిల్లులు స్వాహా అయ్యాయి. అవినీతి ఆరోపణలు బహిర్గతమై ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా విచారణ చేపట్టిన దాఖలాలు లేవు. వైకాపా నాయకుల అండదండలతో ఆయన ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగింది. పెనుకొండ, నల్లమాడ, కొత్తచెరువు, ఓడీసీ మండలాల్లో హరిప్రసాద్‌రెడ్డి స్వాహాపర్వం యథేచ్ఛగా సాగింది. కొత్తచెరువు మండలంలో 6వేల బస్తాల సిమెంటు స్వాహా చేయడంతోపాటు లబ్ధిదారులకు అందాల్సిన దాదాపు వెయ్యి టన్నుల ఇసుక కూపన్లను పక్కదారి పట్టించిన వైనంపై 'ఇవ్వకున్నా ఇచ్చినట్లు...అంతా కనికట్టు' శీర్షికన 2022, మేలో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అప్పట్లోనే అవినీతి అక్రమాలు వెలుగులోకి వచ్చినా అధికారులు మిన్నకుండిపోవడం గమనార్హం. ఓడీసీ మండలంలో వైకాపా నాయకులు గృహాలు నిర్మించకుండానే బిల్లులు వారి ఖాతాలకు జమ చేసుకుని స్వాహా చేసినట్లు అధికారుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. దాదాపు రూ.1.20 కోట్లు అవినీతి జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. నలుగురు పిల్లలు ఉన్నారు. తాత్కాలిక గుడారంలో తలదాచుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నాలుగేళ్ల క్రితం అప్పుడున్న ఏఈ ఇల్లు కట్టిస్తానని రూ.60 వేలు తీసుకున్నారు. పునాది వేసి సిమెంటు ఇటుకలు ఇచ్చారు. మూడేళ్లుగా ఏఈ కనిపించలేదు. ఎవరిని అడగాలో తెలియలేదు. గృహ నిర్మాణశాఖ ఏఈ హరిప్రసాద్‌రెడ్డిని విధుల నుంచి తొలగించాం. ఇటీవల ఓడీసీ మండలంలో జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణంలో రూ.1.20 కోట్లు అవినీతికి పాల్పడినట్లు గుర్తించాం. కలెక్టర్ అరుణ్‌బాబుకు నివేదిక అందజేశాం. అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనారోగ్యంతో ఉన్న భర్త, ఆరుగురు పిల్లల పోషణ భారం నాదే. ప్రభుత్వం ఇచ్చే మొత్తానికి అదనంగా ఇస్తే ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.1.20 లక్షలతోపాటు అప్పుచేసి రూ.95 వేలు ఏఈకి ఇచ్చాను. పైకప్పు అయ్యాక ఆచూకీ లేకుండా పోయారు. మిగిలిన ఇంటి పని పూర్తి చేయలేదు.

# అక్రమ క్వారీయింగ్‌పై చర్యలు తీసుకోవాలి

## అధికారులకు ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆదేశం




**విజయపురం,తెలంగాణ దిశ:** మండలంలోగత ప్రభుత్వంలో అక్రమంగా కొండల నుంచి తోడేసిన గ్రావెల్ క్వారీపై సమగ్ర విచారణ నిర్వహించి సంబం ధించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జమున అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లా డారు. గత ప్రభుత్వంలో కొండల నుంచి గ్రావెల్ మట్టిని అక్రమంగా ఒక సర్వే నంబరులో అనుమతి తీసుకుని మరోచోట మట్టి తవ్వి అక్రమంగా సరిహద్దున ఉన్న తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకు న్నార న్నారు. ఇందుకు అధికారులు వత్తాసు పలికారని, ఇకపై అలాంటి ఆటలు సాగవన్నారు. అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోకుంటే వారిపై చర్యలు తప్పవని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఎక్కడ క్వారీ మైనింగ్ సంబంధించిన లారీలు అక్రమంగా తిరిగితే సీజ్ చేయాలన్నారు. మండల పరిషత్ నిధుల దుర్వినియోగంపై ఉన్న ఫిర్యాదులు విచారించి చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్య పరిష్కరించాల న్నారు. డీఎస్పీ నరసింహమూర్తి, ఎంపీడీవో బ్రహ్మయ్య, తహసీల్దారు మల్లికార్జునరావు, జడ్పీటీసీ సభ్యురాలు రేవతి, అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేను తెదేపా శ్రేణులు నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ క్వారీ, గ్రావెల్ తరలిం పును నిలిపి వేయాలంటూ గ్రామస్థులు, యువత నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని వనదుర్గాపురం పంచాయతీ పరిధి సరిహద్దులో అక్రమంగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా చేపడుతున్న క్వారీని వెంటనే నిలిపివేయాలని నినదించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాం నుంచి తమిళనాడుకు చెందిన వ్యక్తి క్వారీ నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం నుంచి కొంతమేరకు అనుమతి తీసుకొని కొండలు కూడా కొట్టేశాడని వాపోయారు. రాత్రికిరాత్రి బిల్లులు లేకుండా గ్రావెల్‌ను తమిళనాడుకు తరలించి లక్షల్లో వ్యాపారం సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అనుమతి పత్రాలు చూపాలని అడిగితే బెదిరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ప్రభు త్వానికి ఆదాయం చేకూర్చేలా చూడాలని గ్రామస్థులు కోరారు.

# శాంతి భద్రతలకు..విఘాతం కలిగించొద్దు

## ఎంపీ మిథున్‌రెడ్డికి పోలీసు నోటీసులు



**తిరుపతి,తెలంగాణ దిశ:** పుంగనూరు నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ఎలాంటి సమావేశాలు, సభలు నిర్వహించేందుకు వెళ్లకూడదని, నియోజకవర్గ పర్యటనను విరమించుకోవాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి పోలీసులు సూచించారు. పుంగనూరులో కార్యకర్తలతో సమావేశం నిర్వహించేందుకు తిరుపతిలోని తన నివాసం నుంచి బయల్దేరేందుకు యత్నించినఎంపీకి ఏఎస్పీ కులశేఖర్ సమక్షంలో పోలీసులు నోటీసులు జారీచేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి గృహ నిర్బంధంపై పుంగనూరు తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి స్పందించారు. ఎంపీ చేసిన ఆరోపణలను ఆయన తప్పుబట్టారు. గతంలో తెదేపా నాయకులు, కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులు, చేసిన దాడులు ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. గత రెండు సంవత్సరాల్లో ప్రతిపక్షంపై చేసిన దాడులు, అణచివేత కార్యక్రమాలు మీతండ్రిని అడిగి తెలుసుకోవాలన్నారు. తెదేపా కార్యకర్తలపై 307 కేసులు పెట్టారన్నారు. ఎన్ని ఛార్జిషీట్లు వేశారో, పుంగనూరు నియోజకవర్గంలో పెట్టిన కేసులు,జరిగిన అరాచకాలపెఒక క్యాసెట్ రూపంలో పంపమంటే పంపిస్తామన్నారు. ఎన్ని రోజులు తెదేపా కార్యకర్తలు ఇళ్లు వదిలి అజ్ఞాతంలో గడిపారో ఓసారి తెలుసుకోవాలని చెప్పారు.

# ఏడీబీ రోడ్డు పనులు ముమ్మరం



**రంగంపేట,తెలంగాణ దిశ:** ఏడీబీ రోడ్డు విస్తరణ పనులు ఇక పూర్తిస్థాయిలో కొనసాగ నున్నాయి. రాజానగరం, రంగంపేట మధ్య అత్యంత దయనీయంగా తయారైన ఈ రోడ్డు మరమ్మతుకు బీఎస్ఆర్ సంస్థ ఆదివారం చర్యలను చేపట్టింది. గోవిందరాజపురం, వెంకన్నపేట, వడిశలేరు, రామస్వామిపేటల వద్ద ఏర్పడిన భారీ గోతుల్లో మెటల్ వేసి పూడ్చే పనులు జరిగాయి. ఈ గోతుల వల్ల ఇక్కడ కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయే పరిస్థితి ఉండేది. బురద, వర్షపు నీరు వెళ్లేందుకు భూమిలో పైపులైను ఏర్పాటు కోసం యంత్రాలతో కాలువను తవ్వారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల తో ఈ పనులకు తరచూ ఆటంకం కలిగింది.

## దాహం తీరాలంటే..

# సరిహద్దు దాటాల్సిందే




**ఆదోని,తెలంగాణ దిశ:** ఏటా తాగునీటి సమస్యలు తలెత్తడం సర్వసాధారణం. కానీ వర్షాకాలం మొదలైనా.. పల్లెలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పశ్చిమ ప్రాంతంలో గుక్కెడు నీటి కోసం గ్రామీణులు అల్లాడుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపడంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు చేతులెత్తేశారు. ఐదేళ్ల వైకాపా పాలనలో తాగునీటి సమస్య పరిష్కరించడంలో పాలకులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఎవరైనా అడిగితే రోజు విడిచి రోజు తాగునీరు అదిస్తామని లెక్కలు చెబుతారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటోంది. కర్ణాటక గ్రామాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కొలువుదీరిన ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ప్రజల నీటి కష్టాలు తీరుతాయని జనం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ ప్రాంతం ఎక్కువ శాతం ఎల్లెల్సీ కాల్వపై ఆధారపడి ఉంది. ఎల్లెల్సీకి నీరు బంద్ చేయడంతో సమస్య తలెత్తింది. తుంగభద్ర డ్యాం నీటి మట్టం పెరిగిన తర్వాత కాల్వకు విడుదల చేసే అవకాశం ఉంది. ఆదోని ఉమ్మడి డివిజన్‌లో 32 ఎస్ఎస్ ట్యాంకులు ఉన్నాయి. సుమారు ఎస్ఎస్ ట్యాంకుల్లో 50 శాతం దాక నీరు నిల్వ ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉంది. గ్రామాల్లో బిందెడు నీటి కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటి పథకాలు ఉన్నా.. నీరు అందడం లేదు. ఆదోని, ఆస్పరి, ఆలూరు, తుగ్గలి, కౌతాళం, పత్తికొండ, కోస్గి, మంత్రాలయం తదితర మండలాల్లో నీటి సమస్య నెలకొంది. వర్షాకాలంవచ్చినా.. సమస్య తీరడం లేదు. ఆదోని మండలం సంతేకు డ్లురు, పెద్దహరివాణం ఎస్ఎస్ ట్యాంకులు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం హొళగుంద మండలం హెబ్బటం నుంచి అరకొర నీటిని సరఫరా చేస్తున్నారు. అరకొరగానే అందుతుండటంతో గ్రామస్థులు కర్ణాటకలోని బియ్యం సూగూరు, ఇటిక్యాల గ్రామాలకు నాలుగు కి.మీ. తాగునీటి కోసంవెళ్తున్నారు. ఆదోనిమండలం మండిగిరి పంచాయతీలో తాగునీటి సమస్య వేధిస్తోంది. వారం, పది రోజులకోసారి నీరు సరఫరా చేస్తున్నా రు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎలాంటి నీటి సమస్య లేదని చెబుతూ కాలయాపన చేస్తున్నారు. శాశ్వత పరిష్కరం చూపడంలో విఫలమవుతున్నారు. డివిజన్‌లోని చాలా గ్రామాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# 23 నెలలు.. రూ.1000 కోట్ల నష్టం

## గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోవడంతో సమస్యఅప్రమత్తం

## కాకపోతే నీటి వృథానే- ఏర్పాటుకు మరో రెండు నెలల గడువు



**అద్దంకి,తెలంగాణ దిశ:** ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణ వాసులకు మంచినీరు.. 1.40 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేయబడిన ప్రాజెక్టు. రెండేళ్ల క్రితం ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయి. వాటిని తిరిగి ఏర్పాటు చేయడంలో నాటి పాలకులు ఆసక్తి కనబరచలేదు. గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాల కోసమే గేట్ల గురించి పట్టించుకోలేదని నాటి తెదేపా నాయకులు ఆరోపించారు. వారి ఆరోపణలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో దెబ్బతిన్న రెండు గేట్లతో పాటు మెతకగా ఉన్న మిగిలిన గేట్లను మార్చేందుకు నీటిపారుదలశాఖ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో తయారైన నాలుగు గేట్లను అమర్చారు. మిగిలిన వాటిని ఆగస్టు నెలాఖరు నాటికి బిగిస్తామని చెబుతున్నారు. 2022 ఆగస్టు 31న మూడో నంబరు గేటు, 2023 జూన్ 6న రెండో నంబరు గేటు కొట్టుకుపోయాయి. ఈ కారణంగా జలాశయంలోని నీరు మొత్తం సముద్రం పాలైంది. పడవలు, వలలు, చేపలు మొత్తం కొట్టుకుపోయాయి. ప్రస్తుతం జలాశయం వెనుక నీరు లేకపోవటంతో ఖాళీ భూముల్లో నిర్వాసితులు పశుగ్రాసం సాగు చేస్తున్నారు. గుండ్లకమ్మ జలాశయం ఆధారంగా సుమారు రెండు వేలమంది జాలర్లు చేపల వేట ఆధారంగా జీవనం సాగించారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన జాలర్లు కుటుంబాలతో సహా ఇక్కడే దీనిపై ఆధారపడ్డారు. ఒక్కో జాలరి సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి వల, పడవ ఏర్పాటు చేసుకున్నారు. ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోవటంతో వారి పెట్టుబడి మొత్తం సముద్రం పాలైంది. చేసేది లేక వారంతా సొంత ప్రాంతాలకు తరలివెళ్లారు. స్థానికంగా ఉన్న జాలర్లు చేపలవేట వృత్తికి దూరమై కట్టెలు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరికొంత మంది దినసరి కూలీలుగా మారారు. 70 వేల ఎకరాల ఆయకట్టుకు రెండు పర్యాయాలు కలిపి 1.40 లక్షల ఎకరాలకు నీరు అందించడం అనేది రెండేళ్లుగా జరగలేదు. ఆయకట్టులోని భూములున్న రైతులు అధికశాతం వాణిజ్య పంటల వైపు దృష్టి సారించాల్సి వచ్చింది. ఒంగోలు పట్టణానికి మంచినీటి సమస్య ఏర్పడింది. భూగర్భజలం అడుగంటడంతో పరివాహకంలోని రైతులు నీళ్లకోసం ఇబ్బందులు పడ్డారు. నష్టం అంచనా ఇలా..: ఒక్కో జాలరి చేపలు పట్టుకోవటం, విక్రయం ద్వారా నెలకు రూ.25 వేల వరకు ఆదాయం సమకూర్చుకుంటాడు. మొత్తం రెండు వేల మంది జాలర్లు కలిపి రూ.5 కోట్ల వరకు నష్టపోయారు. 23 నెలలకు రూ.115 కోట్ల వరకు నష్టపోయినట్లే. అలాగే ఆయకట్టులోని రైతులు ఒక్కొక్కరూ ఏడాదికి ఎకరాకు గరిష్ఠంగా రూ.30 వేల వరకు ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ప్రస్తుతం జలాశయంలో నీరు లేకపోవటంతో కేవలం ఒక పంటకు మాత్రమే పరిమితమవుతున్నారు. రెండేళ్ల కాలపరిమితితో ఒక్కో రైతు సుమారు రూ.60 వేల వరకు నష్టపోయినట్లు లెక్కేస్తే మొత్తంగా 1.40 లక్షల ఎకరాలకు గాను రూ.840 కోట్ల వరకు నష్టపోయినట్లు స్థానికులు అంచనా వేస్తున్నారు.

# కేంద్రం నిధులిస్తే రహ'దారి'



**అమరావతి,తెలంగాణ దిశ:** గుంటూరు నుంచి హైదరాబాద్ మార్గంలో పేరేచర్ల నుంచి కొండమోడు వరకు నాలుగు వరుసల రహదారిగా విస్తరణకు మార్గం సుగమమైంది. అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారికి అనుసంధానంగా ఉండే ఈమార్గం రహదారి ప్రమాదాలు, ప్రయాణ సమయం, ఇంధనం ఆదా వంటి లక్ష్యాలతో విస్తరించనున్నారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని కొండమోడు నుంచి గుంటూరు సమీపంలోని పేరేచర్ల వరకు జాతీయ రహదారి(167ఏజీ)గా కేంద్రం గుర్తించింది. ఈ మార్గం ప్రాధాన్యత దృష్ట్యా విస్తరణకు కేంద్రం ఆమోదం తెలిపింది. గతేడాది ఆగస్టులో 50కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.1032 కోట్లతో టెండరు పిలిచారు. ఈ పనులను రాజేంద్రసింగ్ బేంబూ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ దక్కించుకుంది. భారత్‌మాల పరియోజన కింద రహదారి విస్తరణ చేపట్టారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలోనే మంజూరైనా కేంద్రం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. పల్నాడు జిల్లా నుంచి పార్లమెంటు సభ్యులుగా ఎన్నికైన లావు శ్రీకృష్ణదేవరాయలు ఈమార్గానికి నిధులు విడుదల చేసి వెంటనే పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని కోరారు. పేరేచర్ల నుంచి కొండమోడు మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించడానికి గుంటూరు, సత్తెనపల్లి ఆర్డీవోల పరిధిలో 234 హెక్టార్ల భూమి సేకరించాలి. సర్వే పూర్తిచేసి ప్రభుత్వ, ప్రైవేటు, అసైన్డు, పోరంబోకు భూములను విభాగాలుగా విభజించి నివేదిక సిద్ధం చేశారు. రహదారి విస్తరణకు ఏ రైతు నుంచి ఎంత భూమి సేకరిస్తారు? ఎంత పరిహారం లభిస్తుందన్న వివరాలు సిద్ధమయ్యాయి. భూసేకరణకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తిచేసి కేంద్రానికి రాష్ట్రం నివేదిక అందించింది. కేంద్రం భూసేకరణకు నిధులు విడుదల చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో సొమ్ము చేసి గుత్తేదారుకు భూమి అప్పగిస్తారు. నాలుగు వరుసల విస్తరణలో ఒక్కొక్క వైపు 8.75మీటర్ల వెడల్పు రహదారి, డివైడర్ 1.5మీటర్లు, రెండువైపులా మార్జిన్‌లు కలిపి 22.5మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారు. మేడికొండూరులో 4 నుంచి 5కిలోమీటర్లు బైపాస్, సత్తెనపల్లిలో 11కిలోమీటర్ల బైపాస్ నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం 7 నుంచి 10మీటర్ల వెడల్పుతో రహదారి ఉండడంతో వాహనాల రద్దీ పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణ సమయం పెరుగుతోంది.

# బాధ్యతలు చేపట్టిన యంత్రాంగం

**మాచర్ల,తెలంగాణ దిశ:** సహకార రంగం ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం వడివడిగా చర్యలు చేపట్టింది. 2018లో సహకార సొసైటీల పాలకవర్గాల సమయం ముగిసింది. ఆతర్వాత కొద్దికాలం పాటు వారినే కొనసాగించారు. తర్వాతి ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో వైకాపా పాలనలో సహకార సంఘాల బాధ్యతలను నామినేటెడ్‌గా భర్తీ చేశారు. దీంతో ఈ పదవులను అడ్డు పెట్టుకుని కొందరు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఏడుగురు సభ్యులతో సహకార బ్యాంకు పాలకమండలిని, ముగ్గురు సభ్యులతో ఒక్కొక్క సొసైటీకి కమిటీని ఏర్పాటు చేసింది. వీరిది ఆడిందే ఆట అన్నట్లుగా గత అయిదు సంవత్సరాలు గడిచాయి. అదే స్థాయిలో పలుచోట్ల భారీ కుంభకోణాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకమండలి రాజీనామా చేసి వైదొలిగింది. సొసైటీల త్రిసభ్య కమిటీలు వైదొలగాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చినా మాచర్ల, గురజాల ప్రాంతాల్లోని కొన్ని సంఘాల్లోని కమిటీ సభ్యులు రాజీనామా చేయలేదు. ప్రస్తుతం ప్రభుత్వం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 167 సంఘాలకు కూడా ప్రత్యేకాధికారులను నియమించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

సహకార బ్యాంకు అఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జిగా జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి ఇప్పటికే బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం వెలువడిన ఉత్తర్వులతో రోజున ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని అన్ని సొసైటీలలో ప్రత్యేకాధికారులు బాధ్యతలు కేటాయించారు.

వీరంతా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేకాధికా రులుగా బాధ్యతల్లో కొనసాగనున్నారు. వైకాపా సర్కారు డీసీసీబీకి ఎన్నికలు జరపకుండా నామినేటెడ్ విధానంలో పాలకవర్గాన్ని ఏర్పాటు చేసింది. అయితే అప్పటికే ప్రత్తిపాడు పరిధిలో నకిలీ పాసు పుస్తకాలతో పొందిన కోట్ల రూపాయల రుణాల అవకతవకలు బయట పడినా మంత్రి కనీసం ఆ ఊసెత్తకపోగా..పాలన బాగుందని కితాబిచ్చారు. సహకార వ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పుకుంటూ సొసైటీలు, సహకార బ్యాంకుల్లో కోట్ల రూపాయలను వైకాపా పాలనలో నియమితులైన పాలకవర్గాలు బొక్కేశాయి. దీనిపై విచారణకు ఆదేశించినా.. ఒక్కరిపై కూడా చర్యలు చేపట్టిన సందర్భం లేదు.

# పచ్చి బొప్పాయి కాయలతోనూ అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి..



మనకు సంవత్సరం పొడవునా అందుబాటులో ఉండే పండ్లలో బొప్పాయి పండ్లు కూడా ఒకటి. బొప్పాయి పండ్లను చాలా మంది ఇష్టంగా తింటుంటారు. ఈ పండ్లను తింటే జీర్ణ సమస్యలు ఉండవు. శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. అలాగే బొప్పాయి పండ్లను తింటే అనేక విటమిన్లు, మినరల్స్, ఎంజైమ్‌లు మన శరీరానికి లభిస్తాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అయితే బొప్పాయి పండ్లే కాదు, పచ్చి బొప్పాయి కాయలు కూడా మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటిల్లోనూ అనేక పోషకాలు ఉంటాయి. పచ్చి బొప్పాయి కాయలను కొందరు పలు రకాల వంటల్లోనూ వేస్తుంటారు. పచ్చి బొప్పాయి కాయలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీన్ని తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలని అంటున్నారు.

**జీర్ణవ్యవస్థకు, మెటబాలిజం పెరిగేందుకు..:** బొప్పాయి పండ్లే కాదు, కాయలను తింటున్నా కూడా జీర్ణ సమస్యలు ఉండవు. పచ్చి బొప్పాయి కాయల్లోనూ పపైన్ అనే ఎంజైమ్ సమృద్ధిగా ఉంటుంది. ఇది మనం తిన్న ఆహారంలో ఉండే కొవ్వులు, ప్రోటీన్లను జీర్ణం చేసేందుకు సహాయం చేస్తుంది. దీంతో తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. గ్యాస్ ట్రబుల్ సమస్య ఉండదు. అసిడిటీ తగ్గుతుంది. మలబద్దకం నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణవ్యవస్థను అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉంచడంలో పచ్చి బొప్పాయి మనకు ఎంతగానో దోహదపడుతుంది. అలాగే ఈ కాయలను తింటే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో కడుపు నిండిన భావనతో ఉంటారు. ఆహారం తక్కువగా తింటారు. దీంతోపాటు శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలని చూస్తున్న వారు పచ్చి బొప్పాయి కాయలను తింటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. వీటి వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది.

**గుండె ఆరోగ్యానికి, డయాబెటిస్ కి..:**

పచ్చి బొప్పాయి కాయల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, బీటా కెరోటిన్ అధికంగా ఉంటాయి. అలాగే పొటాషియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇవన్నీ ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో వాపులు తగ్గుతాయి. కణాలు డ్యామేజ్ అవకుండా రక్షించుకోవచ్చు. శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. పచ్చి బొప్పాయి కాయలను తింటుంటే షుగర్ లెవల్స్ సైతం తగ్గుతాయి. ఈ కాయల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. అలాగే ఫైబర్ ఈ కాయల్లో ఎక్కువగా ఉంటుంది. ఇది షుగర్ లెవల్స్‌ను పెరగకుండా చేస్తాయి. దీంతో డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది.

**చర్మ సంరక్షణకు..:** పచ్చి బొప్పాయి కాయల్లో విటమిన్లు ఎ, సి, ఇ సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మానికి ఎంతో మేలు చేస్తాయి. చర్మం మృదువుగా మారి కాంతివంతంగా ఉండేలా చేస్తాయి. శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపుతాయి. దీంతో చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ కాయల్లో ఉండే ఎంజైమ్‌లు చర్మ కణాలను సంరక్షిస్తాయి. దీంతో మొటిమలు, ముఖంపై ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి. చర్మంలో సహజసిద్ధమైన కాంతి పెరుగుతుంది. పచ్చి బొప్పాయి కాయను పేస్ట్‌లా చేసి ముఖానికి ఫేస్ ప్యాక్‌లా కూడా వేయవచ్చు. దీంతో ముఖంలో కాంతి పెరుగుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. ఈ కాయల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. దీంతో శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. ఈ కాయల్లో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు మన శరీరంలోని బ్యాక్టీరియా, వైరస్‌లను నిర్మూలిస్తాయి. దీంతో రోగాలు, ఇన్‌ఫెక్షన్లు రాకుండా అడ్డుకోవచ్చు. ఇలా పచ్చి బొప్పాయి కాయలను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



# నైపుణ్యాల వైపు అడుగులు..


వృత్తి నైపుణ్యాలు పెంచుకోవడానికి చిన్నస్థాయి మహిళా వ్యాపార వేత్తలు ఆసక్తి చూపుతున్నారు. దాదాపు 70 శాతం మంది ఈ వైపుగా అడుగులు వేస్తున్నారు. భారత్ ఉమెన్ ఆస్పిరేషన్ ఇండెక్స్ %–% 2025 నివేదికలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. దేశంలోని ద్వితీయశ్రేణి నగరాలు, చిన్నచిన్న పట్టణాలకు చెందిన 1,300 మందికిపైగా మహిళా వ్యవస్థాపకులు ఈ సర్వేలో పాల్గొన్నా రు. వీరిలో అత్యధిక మంది 18 నుంచి 55 ఏండ్లలోపు వారే! సొంతంగా వ్యాపారాలను ప్రారంభించి సమర్థంగా నిర్వహిస్తున్నా.. సంస్థాగతంగా అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. తాము ఫైనాన్స్, మార్కెటింగ్‌తోపాటు డిజిటల్ కార్యకలాపాల్లో వెనకబడి పోయినట్లు 70 శాతం మహిళా వ్యాపార యజమానులు వెల్లడించారు. రుణాలు, వ్యాపార నెట్‌వర్క్‌లు, సరైన ప్రాతినిధ్యం లేక.. తమ ఆశయాలు నీరుగారి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాంతో సహచరుల మద్దతు, మార్గదర్శక అవకాశాలకు దూరం అవుతున్నామని చెప్పుకొచ్చారు. సొంతంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నా.. ఆర్థికంగా సొంత నిర్ణయాలు తీసుకోలేక పోతున్నారట. వీరిలో 52 శాతం మంది ఇప్పటికీ డబ్బుల కోసం కుటుంబ పెద్దల దగ్గర చేయి చాస్తున్నారట. బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు తమను తక్కువ రుణ అర్హత కలిగినవారిగా భావిస్తున్నారని 54 శాతం మంది వెల్లడించారు కూడా. ఇది భారతదేశ ఆర్థిక వ్యవస్థలో లోతుగా పాతుకుపోయిన లింగ పక్షపాతాన్ని పట్టి చూపుతున్నదని సర్వే ప్రతినిధులు చెబుతున్నారు. ఇక తమకు ప్రభుత్వ రంగంతోపాటు మీడియాలోనూ తక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని మరో 49 శాతం మంది చెప్పుకొచ్చారు. ఇది కూడా మహిళల వ్యవస్థాపక సామర్థ్యాన్ని మరింత విస్తృతం చేయాల్సిన సామాజిక అవసరాన్ని సూచిస్తున్నది. 52 శాతం మంది ఇ-కామర్స్, ఎడ్‌టెక్ వంటి డిజిటల్ రంగాలలో పనిచేస్తున్నప్పటికీ.. వీరిలో 12 శాతం మంది మాత్రమే డిజిటల్ నైపుణ్యాలను కలిగి ఉన్నారట. ఈ అవరోధాలన్నీ తమ పురోగతికి ఆటంకం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాంతో, ఆయా రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపర్చుకొని.. వ్యాపారాలను మరింత విస్తృతపర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. ఈ నివేదిక ఒక బ్లూప్రింట్ మాత్రమేనని.. ఈ రంగంలో వ్యవస్థాగత అంతరాలను తగ్గించాల్సిన అవసరం ఉన్నదని సర్వే ప్రతినిధులు చెబుతున్నారు. ఇందుకోసం బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, వివిధ వేదికలు, విధాన రూపకర్తలు.. మహిళా వ్యవస్థాపకులకు అండగా నిలవాలని కోరుతున్నారు. వారు ఎదగడానికి సహాయపడాలనీ, అందుకు తగిన పరిష్కారాలను చూపాలని అంటున్నారు.

# రోజులో నీళ్లను అసలు ఏ సమయంలో తాగితే మంచిదో తెలుసా..?

మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వేళకు భోజనం చేయడంతోపాటు ఆహారంలో అన్ని పోషకాలు ఉండేలా చూసుకోవాలి. అలాగే రోజూ వ్యాయామం చేయాలి. కచ్చితంగా తగినన్ని గంటలపాటు నిద్రించాలి. అలాగే రోజుకు తగినన్ని నీళ్లను కూడా తాగాల్సి ఉంటుంది. సాధారణంగా మనం చలికాలంలో తక్కువ నీళ్లను తాగుతాం. ఎండకాలంలో శరీరం వేడిగా మారుతుంది కనుక నీళ్లను ఎక్కువగా తాగుతాం. అయితే వాస్తవానికి రోజులో ఏ సమయంలో నీళ్లను ఎక్కువగా తాగాలి, ఎప్పుడు తక్కువగా తాగాలి.. అసలు ఏ సమయంలో నీళ్లను తాగితే మంచిది.. అన్న వివరాలను ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలను తెలుసుకుందాం.

%ఉదయం పరగడుపునే..: రాత్రి నుంచి ఉదయం వరకు శరీరానికి నీరు లభించదు. ఎందుకంటే మనం నిద్రిస్తూ ఉంటాం. కనుక శరీరానికి పెద్ద మొత్తంలో నీరు ఉదయం అవసరం అవుతుంది. కాబట్టి నిద్రలేచిన వెంటనే 1 లీటర్ నీళ్లను తాగాలని చెబుతున్నారు. 1 లీటర్ నీళ్లను ఒకేసారి తాగలేకపోతే కాస్త విరామం ఇచ్చి తాగవచ్చు. దీంతో మనకు రోజుకు కావల్సిన నీటిలో దాదాపుగా 30 శాతం నీరు ఉదయమే లభిస్తుంది. అయితే ఉదయం గోరు వెచ్చని నీళ్లను తాగితే ఇంకా మంచిది. దీంతో శరీరంలో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లు సులభంగా బయటకు పోతాయి. ముఖ్యంగా మలబద్దకం సమస్యతో బాధపడుతున్న వారు ఉదయం పరగడుపునే గోరు వెచ్చని నీటిని తాగితే ఆ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. జీర్ణాశయం, పేగులు శుభ్రంగా మారుతాయి.

గోరు వెచ్చని నీరు మేలు..: ఉదయం పరగడుపునే గోరు వెచ్చని నీళ్లను తాగడం వల్ల శరీర మెటబాలిజం మెరుగు పడుతుంది. జీవక్రియలు సరిగ్గా నిర్వహించబడతాయి. దీంతో క్యాలరీలు సులభంగా ఖర్చవుతాయి. కొవ్వు కరిగిపోతుంది. అధిక బరువు తగ్గుతారు. ఉదయం నీళ్లను తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. గ్యాస్, అసిడిటీ, అజీర్తి సమస్యలు ఉండవు. రోజంతా మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే భోజనం చేసేందుకు 30 నిమిషాల ముందు నీళ్లను తాగాలి. ఆ సమయంలో ఒక గ్లాస్ నీళ్లను తాగితే కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది.



ఆహారానికి 30 నిమిషాల ముందు..: భోజనం చేసే సమయంలో కాకుండా భోజనం చేసిన అనంతరం 30 నిమిషాలు ఆగి నీళ్లను తాగాలి. ఇలా తాగితే మనం తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. జీర్ణక్రియకు నీళ్లు దోహదం చేస్తాయి. అలాగే వ్యాయామం చేసేముందు ఒక గ్లాస్ నీటిని కచ్చితంగా తాగాలి. లేదంటే డీహైడ్రేషన్ బారిన పడతారు.

రక్త సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది. దీంతో గుండెపై భారం పడుతుంది. ఫలితంగా గుండె కొట్టుకునే వేగం లేదా పనితీరులో మార్పులు వస్తాయి. దీని ప్రభావం గుండెపై పడి హార్ట్ ఎటాక్ లేదా కార్డియాక్ అరెస్ట్ వంటి విపరీత పరిణామాలకు


దారి తీస్తుంది. కాబట్టి వ్యాయామానికి ముందు నీళ్లను తాగడం తప్పనిసరి. అలాగే రాత్రి పూట నిద్రకు ముందు కూడా ఒక గ్లాస్ నీళ్లను తాగాలి. ఇలా చేస్తే రక్త సరఫరా సాఫీగా సాగుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. ఈ విధంగా పలు సమయాల్లో కచ్చితంగా నీళ్లను తాగితే ఆరోగ్యంగా ఉంటారు.

# ఇడ్లీల్లో ప్లాస్టిక్ ఆనవాళ్లు !

**కర్ణాటకలోని పలు హెూటళ్లలో గుర్తించిన అధికారులు**

**వస్త్రానికి బదులు పాలిథీన్ షీట్లు వాడటమే కారణం**

**ఇడ్లీ తయారీకి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించిన ప్రభుత్వం**



బెంగళూరు, : దక్షిణ భారతీయులు ఇష్టంగా తినే ఇడ్లీల్లో ప్లాస్టిక్ ఆనవాళ్లు ఉండటం కర్ణాటకలో కలకలం రేపింది. హెూటళ్లలో ఇడ్లీలను తయారు చేసేటప్పుడు పాత్రలపై వస్త్రాన్ని కప్పి, దానిపై పిండి వేస్తారు. అయితే, కర్ణాటకలోని పలు హెూటళ్లలో వస్త్రానికి బదులు పాలిథీన్ షీట్లు వినియోగిస్తున్నారని ఇటీవల ప్రభుత్వానికి సమాచారం అందింది. దీంతో ఆహార భద్రత శాఖ అధికారులు రాష్ట్రంలో 251 హెూటళ్లపై దాడులు చేసి నమూనాలు సేకరించారు. వీటిని పరీక్షించగా 52 హెూటళ్లలో ఇడ్లీల తయారీకి ప్లాస్టిక్ వినియోగించినట్టు గుర్తించారు. ప్లాస్టిక్‌లో ఉండే క్యాన్సర్ కారకాలు ఇడ్లీల ద్వారా శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉండడంతో ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇడ్లీల తయారీకి ఎక్కడా పాలిథీన్ షీట్లు వాడొద్దని నిషేధం విధించింది. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు గురువారం ప్రకటించారు.

# యుద్ధాలతో పాఠాలు నేర్వని అగ్రదేశాలు..!

ఉక్రెయిన్ యుద్ధానికి మూడేళ్లు పూర్తయ్యాయి. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఈ మూడేళ్లలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. అనేక దేశాలు ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభావితం అయ్యాయి. రష్యా అధినేత పుతిన్ అహంకారం, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మూర్ఖత్వం కారణంగా ఇరు దేశాల ప్రజలు కూడా తీవ్రంగా నష్టపోయారు. అయినా యుద్ధం అయిపోయిదంనడానికి లేకుండా పోయింది. అడపాదడపా దాడులు సాగుతూనే ఉన్నాయి. అలాగే ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధం కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతానికి నివురుగప్పిన నిప్పులా ఉంది. ప్రపంచంలో రాజ్యాధినేతల కారణంగా చిన్నచిన్న దేశాలు చిగురుటాకులా వణుకుతున్నాయి. ఒక్క ఉక్రెయిన్ యుద్ధం కారణంగానే ప్రపంచం ఎంతగా నష్ట పోయిందీ అందరికీ తెలుసు. ప్రధానంగా ధరలపై విపరీత ప్రభావం చూపింది. ఆర్తిక వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. ఈ సమయంలో అన్ని దేశాలు ఉమ్మడి నిర్ణయం తీసుకుని భవిష్యత్ యుద్ధాల నివారణకు పూనుకోవాలి. మధ్యయుగాల్లో దాడులతో ఆయా దేశాలను కబళించిన రాజ్యకాంక్ష ఉన్న నేతల తరహాలోనే నేటి అగ్రరాజ్యాలు వ్యవహరిస్తున్నాయనడానికి ఎలాంటి సంకోచం అవసరం లేదు. ఇలా సైనిక పాటవం ఉన్న దేశాలు ఇదిగో యుద్ధం అదిగో యుద్ధం అంటూ పరిస్థితులను వేడెక్కించడం కారణంగా ప్రజల బతుకులు ఛిద్రం అవుతున్నాయి. ఇలాంటి పరిస్థితి కొనసాగితే ఇప్పుడు ప్రతి దేశం సైనికంగా బలపడాలి. అలాగే చుట్టుపక్కల ఉన్న దేశాలు సైనిక కూటమిగా ఏర్పడాలి. ఇతరదేశాల దాడులను తట్టుకునేందుకు సైనికంగా బలమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరాన్ని ఉక్రెయిన్ యుద్ధం పాఠాలు నేర్పుతోంది. లేకుంటే ఉక్రెయిన్‌లా లొంగిపోక తప్పదు. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్ అధినేత జెలెన్÷–స్కీనే తప్పుపట్టారు. ఆయన టర్మ్ అయిపోయిన నేతగా ప్రకటించారు. అలాగే గాజాను ఆక్రమించు కుంటామని అన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ఆపడానికి రష్యాను కట్టడి చేయడానికి ప్రపంచదేశాల్లో ఏ ఒక్కటీ ప్రయత్నించలేదు. అగ్రరాజ్యాలు తలచుకుంటే ఏ దేశం మీదయినా దాడులు చేయవచ్చని తాజాగా ఉక్రెయిన్ యుద్ధంతో మరోమారు తేలిపోయింది. సైనికపరంగా..ఆర్థికంగా బలంగా ఉంటే చాలని రష్యా, అమెరికాలు తేల్చేశాయి. ఇక అణు సామర్థ్యం ఉంటే అంతే సంగతులు. రేపు చైనా కూడా ఇదే నీతిని అవలంబిస్తుందని వేరుగా చెప్పనక్కర లేదు. పక్కనే ఉన్న తైవాన్ తమ భూభాగమే అని వాదిస్తోంది. అనేకమార్లు దాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేసింది. భారత్‌తో గిల్లి కజ్జాలు పెంచు కుంటోంది. భారత్‌లో ఉన్న అరుణాచల్ తమదే అంటోంది. టిబెట్‌ను అప్పనంగా ఆక్రమించుకుంది చాలక, పాక్‌ను ఎగదోస్తోంది. రెండో ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచం అత్యంత ప్రమాదకరపరిస్థితిలో ఉందని తాజా ఘటనలు రుజువు చేశాయి. గత ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే అగ్రరాజ్యాలుగా ఎదిగిన అమెరికా, రష్యాలు దాడులకు తెగబడుతూనే వచ్చాయి. అమెరికన్లు 1975లో వియత్నాం నుంచి నిష్క్రమించారు. 28 సంవత్సరాల అనంతరం 2003లో ఇరాక్‌ను ఆక్రమించారు. సోవియట్ యూనియన్ సైన్యం 1989లో అఫ్ఘానిస్తాన్ నుంచి వెనక్కి వెళ్లిపోయింది. తరవాత తాలిబన్లను అణచివేసే క్రమంలో అమెరికా అఫ్ఘాన్‌లో పాగా వేసి చేయి కాల్చు కుంది. 33సంవత్సరాల అనంతరం రష్యా సైన్యం ఉక్రెయిన్‌ను దురాక్రమించింది. అమెరికా రష్యాల అగ్రరాజ్య అభిజాత్యాలకు సమస్త ప్రపంచమూ, ముఖ్యంగా వియత్నాం, అఫ్ఘానిస్తాన్, ఇరాక్, ఉక్రెయిన్‌లు భయానక మూల్యాన్ని చెల్లించుకుంటూనే ఉన్నాయి. ఏ చిన్న కారణం దొరికినా అగ్రరాజ్యాలు తమ ప్రతాపం చూపిస్తున్నాయి. రష్యా, అమెరికాల సరసన ఇప్పుడు చైనా కూడా చేరబో తున్నది. తన ప్రతాపం చూపేందుకు అది అడపాదడపా యత్నిస్తూనే ఉంది. భారత్ వంటి పెద్ద దేశాన్ని కూడా అది భయపెడుతూనే ఉంది. ఇలా పొరుగు దేశం ఉక్రెయిన్‌ను రష్యా దురాక్రమించడమే ఇందుకు తాజా ఉదాహరణగా చెప్పుకోవాలి. అగ్రరాజ్యాలు గతంలో పాల్పడిన సైనిక దుస్సాహసాల గురించి ప్రపంచం ఇప్పుడు ఆలోచించాలి. వియత్నాం, ఇరాక్‌లో అమెరికా, అఫ్ఘానిస్తాన్‌లో సోవియట్ యూనియన్ ఇటువంటి దుస్సాహసాలకే పాల్పడ్డాయి. ఆ మూడు సైనిక జోక్యాలు అంతిమంగా విఫలమయ్యాయి. దురాక్రమించుకున్న దేశంలో ప్రజల జీవితాలను ఛిద్రం చేశాయి. ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ప్రతికూల పర్యవసానాలకు ఈ దురాక్రమణలు దారితీశాయి. 1965లో అధ్యక్షుడు లిండన్ జాన్సన్ వియత్నాంలో అమెరికా జోక్యంతో మొదల య్యింది. అయితే వియత్నాం అమెరికాను నిలువరించడంలో గట్టిగానే పోరాడింది. క్యూబా విషయంలోనూ అమెరికాకు గట్టి ఎదురుదెబ్బే తగిలింది. 1979 డిసెంబర్‌లో అఫ్ఘాని స్తాన్‌ను ఆనాటి సోవియట్ యూనియన్ ఆక్రమించుకుంది. అఫ్ఘాన్‌లో సోవియట్ యూనియన్ ఒక దశాబ్దం పాటు తిష్ఠవేసింది. అయితే రష్యాను వ్యతిరేకించే క్రమంలో అమెరికా తాలిబన్లను సృష్టించింది. విషాద మేమిటంటే సోవియట్ వ్యతిరేక పోరు మత ఛాందసవాదతత్వాన్ని సంతరించుకుంది. అంతర్యుద్ధం కారణంగా అఫ్ఘాన్ శిథిలం అయ్యింది. వియత్నాం నుంచి అమెరికా నిష్క్రమించినట్టుగానే సోవియట్ అఫ్ఘాన్ నుంచి నిష్క్రమించక తప్పలేదు. అఫ్ఘాన్ అనంతరం ఇరాక్‌ను దురాక్రమించేందుకు అమెరికా దాడులు చేసింది. ఇరాక్ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయనే కట్టుకథను అమెరికన్ పాలకులు ప్రచారం చేశారు. నిజానికి ఇరాక్‌ను దురాక్రమించుకోవడం అగ్రరాజ్య దురహంకార చర్య తప్ప మరోటి కాదు. అలా అక్కడి సద్దాం ప్రభుత్వాన్ని కూలదోయడమే గాకుండా అతడిని ఉరితీసే వరకు నాటి అధ్యక్షుడు బుష్ నిద్రపోలేదు. ఇలా జరిగిన ఘటనలన్నీ ఇప్పటికీ ప్రపంచాన్ని కలవరపెడుతూనే ఉన్నాయి. వియత్నాం, ఇరాక్‌లు అమెరికాకు భౌగోళికంగా వేల కిలోమీటరల్ దూరంలో ఉన్నాయి. అఫ్ఘానిస్తాన్ సోవియట్ యూనియన్ సరిహద్దులకు సమీపంలో ఉన్న దేశం. ఉక్రెయిన్, రష్యన్ ఫెడరేషన్‌కు పొరుగు దేశం. తాను ప్రపంచ ఏకైక అగ్ర రాజ్యాన్ని కనుక ఎక్కడైనా సరే ఎవరూ తన మాటను జవ దాటకూడదనే అహంకారమే ఇరాక్ ఆక్రమణకు అమెరికాను పురిగొల్పింది. వియత్నాం, అఫ్ఘాన్, ఇరాక్, ఉక్రెయిన్లలో అగ్రరాజ్యాల దాడులు అన్నీ అహంకారపూరితంగా సాగినవే అని చెప్పాలి. అలాగే 1979లో అఫ్ఘాన్‌ను సోవియట్ యూనియన్, ఇప్పుడు ఉక్రెయిన్‌ను రష్యా దురాక్రమించడం పూర్తిగా న్యాయవిరుద్ధం. అధికారంలో ఉన్న అమెరికా, రష్యా నేతల అహంకారమే అందుకు పురిగొల్పాయని భావించాలి. తమకంటే చిన్న వైన, సైనికం గా అంతగా శక్తిమంతం కాని దేశాలను ఆక్రమించుకోవడం తమ హక్కుగా అగ్రరాజ్యాలు భావించడం వల్లనే ఇలాంటి విపత్కర పరిస్థితులను ఇప్పుడు ప్రపంచ దేశాలు చూడాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ దేశాలు భవిష్యత్ గురించి ఆలోచించాలి. ఐక్యరాజ్య సమితి ఉత్సవ విగ్రహంలా కాకుండా నిర్ణయాత్మక పాత్ర పోషించాలి.

# గిరిజన హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వం..?



## - అటవీ భూముల నుంచి బలవంతంగా గెంటివేత..!
## - వాణిజ్య అవసరాలకు ప్రకృతి సంపద ధారాదత్తం..?
## - చట్టాలను కార్పొరేట్లకు చుట్టాలుగా మారుస్తున్న సర్కార్..!

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ తన తాజా 'మన్ కీ బాత్' కార్యక్రమంలో గిరిజనులపై ప్రశంసల వర్షం కురిపించారు. అనేక గిరిజన తెగలు మన చరిత్ర, సంస్కృతిలో అంతర్భాగమయ్యాయని, పలువురు గిరిజనులు దేవతలుగా కీర్తించబడ్డారని కొనియాడారు. అటవీ సంపద పరిరక్షణలో వారంతా భాగస్వాములవుతున్నారని చెప్పారు. ప్రకృతితో ఎలా సహజీవనం చేయాలో వారు ఈ ప్రపంచానికి నేర్పారని తెలిపారు. ప్రధాని తన 119వ మన్ కీ బాత్‌లో గిరిజనం గురించి చెప్పిన మాటలు అక్షర సత్యాలు. అయితే ప్రకృతితో గిరిజనులకు ఉన్న అనుబంధాన్ని తన ప్రభుత్వం ఎలా తెంచేస్తోందో మాత్రం ఆయన చెప్పలేదు. తమ ఆవాసాలుగా భావించే నదులు, అడవులు, కొండలు, గుట్టలు, పచ్చిక బయళ్ల నుంచి గిరిజనులను ఎలా తరిమేస్తున్నదీ చెప్పలేదు. నిరాశ్రయులవుతున్న లక్షలాది ఎస్టీలు: 2013లో రూపొందించిన ఓ అంచనా ప్రకారం–వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాలు, జాతీయ పార్కుల ఏర్పాటు పేరుతో ఆరు లక్షల మంది గిరిజనులను కేంద్రం నిరాశ్రయులను చేసింది. దేశంలో ఉన్న పులుల సంరక్షణ ప్రాంతాల (టైగర్ రిజర్వ్) నుంచి 64,801 కుటుంబాలను కలిగిన 591 గ్రామాలను ఖాళీ చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని పులుల సంరక్షణ జాతీయ సంస్థ గత సంవత్సరం జూన్ 19న సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ సంస్థ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆజమాయిషీలో నడుస్తోంది. టైగర్ రిజర్వ్‌లలో నివసిస్తున్న వేలాది మంది గిరిజనులు ఆ సంస్థ ఆదేశాలను నిరసిస్తూ ఆందోళన కొనసాగిస్తున్నారు. దేశంలోని యాభై టైగర్ రిజర్వ్‌ల నుంచి ఐదున్నర లక్షల మంది ఎస్టీలు, ఇతరులను బలవంతంగా ఖాళీ చేయించేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఇలా షెడ్యూల్డ్ తెగల వారిని టైగర్ రిజర్వ్‌ల నుంచి బలవంతంగా ఖాళీ చేయించడం వన్యప్రాణుల సంరక్షణ చట్టం సహా అనేక చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ ఒప్పందాలకు కూడా ఇది విరుద్ధమే అవుతుందని వారు గుర్తు చేశారు. అయినా కేంద్రం తన ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. కేవలం 2021 తర్వాతే టైగర్ రిజర్వ్‌ల నుంచి ఖాళీ చేయించాల్సిన 2.9 లక్షల మందిని గుర్తించింది.

చట్టానికి తూట్లు: 2006 నాటి అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఎఫ్‌ఆర్‌ఏ) కింద గిరిజన తెగలన్నింటికీ హక్కులు ఉన్నాయి. తాము స్వచ్ఛందంగా అంగీకరించి ఖాళీ చేస్తే తప్ప ఫారెస్ట్ రిజర్వ్‌లో నివసించే హక్కును వారికి ఆ చట్టం కల్పించింది. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వాలు వారికి టైటిల్ డీడ్స్ కల్పించాల్సి ఉంటుంది. అయితే చాలా మంది గిరిజనులకు నేటికీ అవి అందలేదు. ఎఫ్‌ఆర్‌ఏ కేవలం కాగితపు పులిగా మిగిలిపోయింది. గత ఏడాది మహారాష్ట్ర, ఒడిశా, కర్నాటక, అసోం, ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని జిల్లాలలో చేసిన అధ్యయనం ప్రకారం చట్టాన్ని అమలు చేయడంలో వైఫల్యం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

వాణిజ్య అవసరాలకు అటవీ భూములు: కార్పొరేట్ సంస్థలు, బడా వ్యాపారులు తమ వనరులు, భూములను వాణిజ్య అవసరాల కోసం సేకరించడాన్ని అనేక గిరిజన తెగలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమ అంగీకారం లేకుండానే మైనింగ్ కార్యకలాపాలు జరుపుతున్నారని, పర్సా బొగ్గు గని వద్ద విచక్షణారహితంగా చెట్లను నరికేశారని ఛత్తీస్‌గఢ్‌లోని హస్‌డియో అరంద్ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనం ఆరోపిస్తోంది. గ్రామసభ అనుమతి పొందినట్లు ఫోర్జరీ పత్రాలు సృష్టించి మైనింగ్ చేపట్టారని విచారణలో తేలింది. 2024లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అటవీ సంరక్షణ చట్టాన్ని సవరించింది. 'అడవి' అనే పదానికి సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చింది. ఎలాంటి అనుమతులు అవసరం లేకుండా అటవీ భూములను అభివృద్ధి పనుల కోసం సేకరించవచ్చునని స్పష్టం చేసింది. అయితే సుప్రీంకోర్టు అడ్డుపడడంతో గిరిజనులకు కొంత ఊరట లభించింది. అటవీ భూముల్లో సర్వేలు చేపట్టేందుకు, డ్రిల్లింగ్ నిర్వహించేందుకు అనుమతులు ఇచ్చే విషయంలో ఉదారంగా వ్యవహరించాలంటూ గత సంవత్సరం నవంబరులో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పర్యావరణ శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. గుజరాత్‌లోని గిర్ అడవుల్లో గిరిజనులు పులుల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారు ప్రకృతితో సహజీవనం చేస్తున్నారని చెప్పడానికి ఇది ఓ ఉదాహరణ అని ప్రధాని తన మన్ కీ బాత్‌లో చెప్పారు. కానీ అక్కడ జరిగిందేమిటి? గుజరాత్‌లో 2010లో 411 పులులు ఉండగా 2020 నాటికి వాటి సంఖ్య 676కి పెరిగింది. అయితే అదే సమయంలో గిరిజనుల జీవనాధారమైన పశు సంపదపై పులులదాడి ఎక్కువైంది. గిరిజనులపై కూడా పులులు దాడి చేసిన ఉదంతాలుఉన్నాయి. సహజీవనం మాట దేవుడెరుగు వారు పులులు అంటేనే భయపడే పరిస్థితి తలెత్తింది. వాటి కారణంగా తమ ఆర్థిక పరిస్థితి దెబ్బ తింటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# మాట మార్చుతున్న ట్రంప్!

జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే డోనాల్డ్ ట్రంప్ మాటలు మారుతున్నాయి. అలాంటి వారు మడమ తిప్పటమే తరువాయి. సహజంగానే వ్యాపారి అయిన ఆ పెద్దమనిషి తనదైన శైలిలో అందరితో బేరసారాలాడుతన్నాడు. బిస్కెట్లు వేస్తున్నాడు. ఏది లాభసాటిగా ఉంటే దాన్నే అనుసరిస్తాడు. అధికారాన్ని చేపట్టిన నెల రోజుల తరువాత బుధవారం నాడు మొదటిసారిగా ట్రంప్ మంత్రివర్గ తొలి సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. ఖనిజాల మీద ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ ఉక్రెయిన్ భద్రత గురించి సాధారణం కంటే ఎక్కువగా ఎలాంటి హామీలు ఇవ్వటం లేదని ట్రంప్ చెప్పాడు. అంతే కాదు, శాంతి ఒప్పందం కుదరాలంటే పుతిన్ కొన్ని రాయితీలకు అంగీకరించాల్సి ఉంటుందని కూడా చెప్పాడు. ఒక వైపు స్థంభింపచేసిన నిధులపై ఆంక్షలను ఎత్తివేస్తూ ఆయుధాలు కొనుగోలు చేసేందుకు తైవాన్‌కు అవకాశం కల్పించిన ట్రంప్ దాని రక్షణ గురించి అడగ్గా తాను వ్యాఖ్యానానికి నిరాకరించటమే కాదు. చైనా పెట్టుబడులను అమెరికాకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పాడు. ఇది అమెరికా వైఖరికి భిన్నంగా ఉంది. అందించిన మిలిటరీ, ఆర్థిక సాయాన్ని తీర్చే స్థితిలో ఉక్రెయిన్ లేనందున అక్కడ ఉన్న 500 బిలియన్ డాలర్ల విలువగల విలువైన ఖనిజాలు, సహజ సంపదలున్న ప్రాంతాలను తమకు అప్పగించాలని అమెరికా డిమాండ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. తీరా ఇప్పుడు వాటిని వెలికి తీసేందుకు రెండు దేశాలు కలసి ఒక సంస్థను ఏర్పాటు చేసి తద్వారా వచ్చే రాబడిలో సగాన్ని దాని ద్వారా ఉక్రెయిన్ రక్షణ, పునర్ నిర్మాణానికి ఖర్చు చేయాలని అంగీకరించినట్లు చెబుతున్నారు. అమెరికా ఇచ్చిన సాయానికి అది ఖనిజాలను స్వాధీనం చేసుకుంటే తామిచ్చినదాని సంగతేమిటనే ప్రశ్న నాటోలోని ఐరోపా ధనిక దేశాల నుంచి రావటం అనివార్యం. అందువలన ఉమ్మడి సంస్థ పేరుతో అమెరికా పెత్తనంలోకి వెళ్లేట్లుగా చూస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే ఒకటి స్పష్టమైంది. గత మూడు సంవత్సరాలుగా ఉక్రెయిన్ ప్రతిఘటనలోరష్యాకు తగిలిన ఎదురు దెబ్బలు, ఓటమి అంటూ పశ్చిమ దేశాలు, వాటి కనుసన్నలలో నడిచే మీడియా వండివార్చిన కట్టుకథలు, కృత్రిమ వీడియోలు వాస్తవం కాదని, ఉక్రెయిన్ ఓడిపోవటం తప్ప మరొకటి జరగదని తేలిపోయింది. అంతేగాక, ప్రతిదాన్ని డాలర్ల లాభాలతో కొలిచే ట్రంప్‌కు ఉక్రెయిన్ మీద పెట్టే ప్రతి డాలరునూ రాబట్టుకోవటం కష్టమని, అందువల్లనే ఖనిజాల ఒప్పందం అని కూడా చెబుతున్నారు. మరొకదానితోనో కాదని ట్రంప్ యంత్రాంగ చర్యలతో అనే కొత్త పల్లవిని పశ్చిమ దేశాల విశ్లేషకులు ఎత్తుకున్నారు. శుక్రవారం నాడు జెలెన్స్కీ వాషింగ్టన్ వెళతాడని, ఒప్పందం మీద సంతకాలు చేస్తాడని వచ్చిన వార్తలు కార్యరూపం దాలిస్తే ఒప్పంద అంశాలు వెల్లడైన తరువాత మాత్రమే ఒక స్పష్టత వస్తుంది.


# బన్నీతో దిల్‌రాజ్ సినిమా





ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు ప్రముఖ నిర్మాత దిల్ రాజుతో విడదీయరాని బంధం ఉంది. తొలి చిత్రం 'గంగోత్రి' తర్వాత అల్లు అర్జున్ తో 'ఆర్య' మూవీని నిర్మించి మంచి విజయాన్ని కట్టబెట్టాడు దిల్ రాజు. ఆ తర్వాత దిల్ రాజు బ్యానర్ లో 'పరుగు, ఎవడు, డి.జె. దువ్వాడ జగన్నాథమ్' చిత్రాలను బన్నీ చేశాడు. అప్పట్లోనే అల్లు అర్జున్ హీరోగా 'ఐకాన్ : కనబడుట లేదు' అనే సినిమా నిర్మించబోతున్నట్టు దిల్ రాజు ప్రకటించాడు. దానిని శ్రీరామ్ వేణు డైరెక్ట్ చేస్తారనీ అన్నారు. కానీ ఎందుకో అది మాత్రం పట్టాలెక్కలేదు. ఇటీవల విడుదలైన'పుష్ప–2'తో బన్నీ ఇమేజ్ అమాంతంగా పెరిగి పోయింది. ఈసినిమా వరల్డ్ వైడ్ రూ. 1871కోట్ల గ్రాస్‌ను వసూలు చేసింది. అల్లు అర్జున్ తదుపరి చిత్రాలపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే... తాజాగా అల్లు అర్జున్...దిల్ రాజుబ్యానర్ లో సినిమా చేయడానికి పచ్చజెండా ఊపాడని తెలుస్తోంది. ఇది 'ఐకాన్' మూవీనేనా...లేక పోతే వేరే కథను తీసుకుంటారా అనేది తెలియాల్సి ఉంది. అసలు ఇప్పుడున్న కమిట్ మెంట్స్ మధ్యలోదిల్ రాజుకబన్నీ డేట్స్ ఇవ్వడమే పెద్ద విషయం అనీ అంటున్నారు. మొదటి సినిమా నిర్మాతగా దిల్ రాజుకు చుక్కులు చూపించింది. రెండో సినిమా ఘన విజయం సాధించి, దిల్ రాజు ప్రొడక్షన్ హౌస్ కు కొత్త ఊపిరిలూదింది. ఇలాంటి పరిస్థితుల్లో అల్లు అర్జున్... దిల్ రాజుకు డేట్స్ ఇవ్వడమంటే గ్రేట్ అని సినిమా వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఇదిలా ఉంటే... 'పుష్ప–2' రేంజ్ మామూలుగా లేదనే విషయం మరోసారి ప్రూవ్ అయ్యింది. అమెరికన్ పాపులర్ షో 'ఎన్.బి.ఎ.గేమ్ లో ఛీర్ లీడర్స్ ఏకంగా 'పుష–2'లోని వస్తున్నాయ్ పీలింగ్స్ పాటకు స్టెప్పులేసి అలరించారు. ఇండియన్ సినిమా ఒకటిగ్లోబల్ స్టేజ్‌లో ఏ పొజిషన్ కు చేరుకుందో చెప్పడనికి ఇదో గొప్ప ఉదాహరణ. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ ఎవరితో సినిమా చేసినా... అది సంచలనం అవుతుందనడంలో సందేహం లేదు.

# ఎస్ఎస్ఎంబీ-29లో మహేష్ న్యూలుక్




టాలీవుడ్ దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. ఎస్ఎస్ఎంబీ29 అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఇక ఈ సినిమా అప్‌డేట్‌ల కోసం అటు బాబు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ తెగ ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మహేశ్ కొత్త లుక్‌కి సంబంధించి ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

రాజమౌళితో పాటు ఈ సినిమా కోసం మహేశ్ కూడా బాగా కష్టపడుతున్నారు. ఇప్పటికే జుట్టు గడ్డం పెంచేసి లుక్స్ మొత్తం మార్చేసిన మహేశ్ తాజాగా జిమ్‌లో వర్కౌట్స్? చేస్తున్నాడు. అయితే మహేశ్ జిమ్‌లో ఎక్సర్‌సైజ్ అనంతరం అద్దం ముందుకు వెళ్లి తన లుక్‌ని చూసుకుని బయటకు వెళ్లే వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఇందులో జుట్టు మొత్తం వదిలేసి రగ్గడ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. దీంతో ఈ వీడియో ఒక్కసారిగా సోషల్ మీడియాలో ట్రెండింగ్ లోకి దూసుకెళ్లింది.ఇక వీడియో చూసిన

అభిమానులు బాబు కొత్త లుక్ అదుర్స్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. అడ్వెంచర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే కథతో వస్తుండగా.. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుంది.

# విశ్వంభర రిలీజ్ మీద వీడని సస్పెన్స్..?




సినిమా ఇండస్ట్రీలో రాణించడం అంటే అంత ఆషామాషీ వ్యవహారమైతే కాదు. అహర్నిశలు కష్టపడుతూ వచ్చిన అవకాశాన్ని వాడుకుంటూ ముందుకు దూసుకెళ్లిన వాళ్ళు మాత్రమే ఇక్కడ మెగాస్టార్లుగా వెలుగొందుతారు. అలా కాకుండా ఏదో టైమ్ పాస్ కోసం ఇండస్ట్రీకి వచ్చినవాళ్లు ఎంత తొందరగా అయితే వస్తారో అంతే తొందరగా ఇండస్ట్రీ నుంచి ఫేడ్ అవుట్ అయిపోతూ ఉంటారని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు తెలుగు సినిమా ఇండస్ట్రీలో మెగాస్టార్ చిరంజీవి కి చాలా మంచి గుర్తింపైతే ఉంది. ఆయన చేసిన సినిమాలన్నీ భారీ విజయాలను సాధించడమే కాకుండా ఇప్పటివరకు ఆయన సాధించిన విజయాలు ఒకెత్తయితే ఇకమీదట చేయబోయే సినిమాలు మరోకెత్తుగా మారబోతున్నాయి. ఇక ఇప్పటికే ఆయన వశిష్ట డైరెక్షన్ లో చేసిన విశ్వంభర భారీ విజయాన్ని సాధిస్తుందంటూ ఫాన్స్ అందరు పండగ చేసుకుంటున్నారు. మరి ఇలాంటి సందర్భంలోనే ఇండియన్ సినిమా ఇండస్ట్రీ మొత్తం ఇప్పుడు విశ్వంభర సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పాన్ ఇండియా సినిమాగా రాబోతున్న ఈ సినిమా దాదాపు 150 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కింది. మరి ఇలాంటి సందర్భంలో ఈ సినిమా దాదాపు 500 కోట్ల వరకు కలెక్షన్స్ ను కొల్లగొడుతుందనే అంచనాలైతే ఉన్నాయి. మరి దానికి తగ్గట్టుగానే మెగాస్టార్ చిరంజీవి చేస్తున్న ఈ సినిమా ఏ మేరకు రాణిస్తుంది. తద్వారా ఆయన ఈ సినిమాతో ఎలాంటి క్రేజ్ ని మూట గట్టుకోబోతున్నాడనేది కూడా తెలియాల్సి ఉంది.అయితే ఈ సినిమాని మొదట మే తొమ్మిదోవ తేదీన రిలీజ్ చేస్తున్నాం అంటూ మేకర్స్ అనౌన్స్ చేసినప్పటికీ, ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమా అనుకున్న డేట్ కి తీసుకు వచ్చే విధంగా కనిపించడం లేదట. కారణం ఏంటి అంటే ఈ సినిమాలో సిజీ వర్క్ ఎక్కువగా ఉండటం వల్ల సిజీ కి సమయం సరిపోవడం లేదని మరో రెండు నెలల్లో రిలీజ్ డేట్ దగ్గర పడుతుంది.కాబట్టి ఈ సమయంలో ఈ సినిమాని ఫాస్ట్ ఫాస్ట్ గా పనులు పూర్తి చేసి తీసుకురావడం చాలా కష్టమని మేకర్స్ భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. మరి వాళ్ళు అనుకున్నట్టుగానే ఈ సినిమాతో భారీ విజయాన్ని అందుకోవాలంటే మాత్రం ఔట్ పుట్ విషయంలో ఎక్కడ కాంప్రమైజ్ అవ్వకూడదని స్ట్రాంగ్ గా ఫిక్స్ అయ్యారట. దానికోసమే ఈ సినిమాను మరింత లేట్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. ఇక ఏది ఏమైనా కూడా ఈ సినిమా మాత్రం బాగా వచ్చిందని సిజీ వర్క్ మొత్తం ఫినిష్ అయిన తర్వాత ఫస్ట్ కాపీ వచ్చేసరికి సినిమా నెక్స్ట్ లెవెల్ లో ఉండబోతుందంటూ సినిమా మేకర్స్ చెబుతూ ఉండటం విశేషం. ఇక ఏది ఏమైనా కూడా ఈ సినిమాతో వశిష్ట స్టార్ డైరెక్టర్ గా మారిపోతాడు అంటూ మరి కొంతమంది కామెంట్స్ చేస్తున్నారు. మరి చిరంజీవి ఈ సినిమాతో ఏ రేంజ్ సక్సెస్ ను సాధిస్తాడు. తద్వారా ఆయన ఈ సినిమాతో ఎలాంటి గుర్తింపును సంపాదించుకుంటాడు అనేది తెలియాలంటే మరి కొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే..

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215